ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

గురువారం 20 ఫిబ్రవరి 2025



## వేర్వేరు ప్రదేశాల్లో 220 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురి అరెస్టు, రెండు వాహనాలు సీజ్

జిల్లాలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు 220 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. పరారైన మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

- వార్త 8వ పేజీలో

# హత్యచేసి కాల్చేశారు!

**కాపులుప్పాడ ప్రాంతంలోగల ఓ లేఅవుట్‌లో గుర్తు తెలియని వ్యక్తి దహనం**

**హతుడు పెందుర్తి జ్యోతిష్కుడు మోతి అప్పన్న అయి ఉండవచ్చునని అనుమానం**

- ఆనందపురం వెళ్లేందుకని చెప్పి పది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు...
- తిరిగి రాకపోవడంతో మరుసటిరోజు పోలీసులకు కుమారుడి ఫిర్యాదు



శవాన్ని దహనం చేసిన ప్రదేశంలో పూసల దండలు. (ఇన్‌సెట్‌లో) అదృశ్యమైన జ్యోతిష్కుడు మోతి అప్పన్న (ఫైల్ ఫొటో)

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

**నగర పరిధిలోని కాపులుప్పాడ వద్ద గల ఒక ప్రైవేటు లేఅవుట్‌లో వ్యక్తి శరీర భాగాలు కాలిపోయి చెల్లా చెదురుగా పడివుండడం కలకలం రేపింది. అవి పది రోజుల క్రితం అదృశ్యమైన పెందుర్తి బీసీ కాలనీ నివాసి, జ్యోతిష్కుడు మోతి అప్పన్న (50)వి అయి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. హత్య చేసి గుర్తుపట్టకుండా ఉండేందుకు దహనం చేసి ఉంటారని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.**

పెందుర్తికి చెందిన అప్పన్న జ్యోతిష్కుడు. వృత్తి రీత్యా ఊళ్లు తిరుగుతుంటారు. అలాగే ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఆనందపురం వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. రాత్రికి తిరిగి రాకపోవడంతో మరుసటిరోజు పదో తేదీన ఆయన కుమారుడు దుర్గాప్రసాద్ ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు కింద నమోదుచేసిన పోలీసులు పరిసర గ్రామాల్లో గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తుండగా 9వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బోయపాలెం నుంచి చేపలుప్పాడ వైపు వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తి పల్సర్ 220 వాహనం వెనుక తన తండ్రి కూర్చుని ఉన్నట్టు తనయుడు దుర్గాప్రసాద్ నాలుగు రోజుల కిందట గుర్తించారు. అప్పటి నుంచి కాపులుప్పాడ-చేపలుప్పాడ మార్గంలో గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం గంబీరం గెడ్డ సమీపంలో ఉన్న ఆర్ఎస్‌పి లేఅవుట్‌లోని ఒక ప్లాట్ కాంపౌండ్‌లో ఉన్న చిన్న షెడ్డు వద్ద శవం కాల్చిన ఆనవాళ్లు కనిపించాయి. పరిసరాల్లో పుర్రె, చేతి, కాలి ఎముకలు పడి ఉన్నాయి. ఈ సమాచారాన్ని భీమిలి, ఆనందపురం సీఐలకు అందజేశారు. విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజుతో సీఐలు బొడ్డేపల్లి సుధాకర్, సీహెచ్ వాసునాయుడు, సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకున్నారు. శవం కాలిబూడిదైన ప్రదేశంలో పడి ఉన్న రుద్రాక్షలు, ఎరుపు, పసుపు పూసలు దండలు, కనకదుర్గమ్మ ఫొటో, ఆకుపచ్చ పంచె అవశేషం గుర్తించి అవన్నీ తన తండ్రివేనని దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. తన తండ్రిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి దహనం చేసి ఉంటారని బోరున విలపించారు. క్లూస్ టీమ్ సంఘటనా స్థలిలో లభ్యమైన ఆధారాలను సేకరించింది. కాగా, సంబంధిత ప్రహరీ లోపల గల షెడ్డు వద్ద రక్తపు మరకలు ఉండడాన్ని పోలీసులు గమనించారు. ఈ శరీర భాగాల అవశేషాలను పోలీసులు సేకరించారు. ఏసీపీ అప్పలరాజు మాట్లాడుతూ కాలిబూడిదైన శరీరం

... మిగతా 8వ పేజీలో

# మైనింగ్ మాఫియాపై విజిలెన్స్

**నల్లరాయి క్వారీలు, క్రషర్లలో విస్తృతంగా తనిఖీలు**



కుంచంగి రెవెన్యూలో అనుమతి లేకుండా నడుస్తున్న నల్లరాయి క్వారీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**గత వైసీపీ పాలనలో గుట్టుగా సాగిన మైనింగ్ అక్రమాలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. నల్లరాయి క్వారీలు, క్రషర్లలో యథేచ్ఛగా సాగిన అక్రమాలను బహిర్గతం చేసేందుకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల బృందం సిద్ధమైంది. గత నవంబరులో నల్లరాయి క్వారీల్లో తనిఖీలు జరిపి పలువురు నిర్వాహకులకు జరిమానాలు విధించిన విజిలెన్స్ అధికారులు.. తాజాగా తనిఖీలను ముమ్మరం చేశారు.**

- వాహనాలు సీజ్, జరిమానాలు
- మైనింగ్ అక్రమార్కులతో కూటమిలో ఓ పార్టీకి చెందిన కొందరు నేతలు కుమ్మక్కు అయినట్టు ఆరోపణలు
- ప్రభుత్వం మారిన తరువాత కూడా మాఫియాదే హవా!
- ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన మరో పార్టీ నాయకులు

గత వైసీపీ హయాంలో మైనింగ్ మాఫియా కనుసన్నల్లో అక్రమ మైనింగ్ సాగిన సంగతి తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఆదే మాఫియా ఆధ్వర్యంలో అక్రమ మైనింగ్ జరుగుతున్నది. కొందరు దీనిపై ఆధారాలతోసహా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లాకు చెందిన ఒకరిద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా నల్లరాయి క్వారీల్లో అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమ మైనింగ్ మాఫియా కదలికలపై కొద్ది రోజులుగా నిఘా పెట్టారు. తాజాగా అనకాపల్లి మండలంలోని నల్లరాయి క్వారీలు, క్రషర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండడంతో అక్రమార్కుల వెన్నులో వణుకు పుడుతున్నది. క్వారీల నుంచి రవాణా చేస్తున్న రోడ్డు మెటల్, కంకర, రాంబిల్లి మండలంలో ఎన్ఏఓబీకి రాళ్లను రవాణా చేస్తున్న భారీ వాహనాలను ఆపి, వే బిల్లులను తనిఖీ చేస్తున్నారు. మెటల్/ కంకర/ రాయిని ఎక్కడ లోడింగ్‌చేశారు, ఎక్కడికి రవాణా చేస్తున్నారో పరిశీలిస్తున్నారు. నల్లరాయి క్వారీలు, క్రషర్లకు అనుమతులు ఉన్నాయా? ఒకవేళ ఉంటే అనుమతించిన ప్రదేశంలోనే నిర్వహిస్తున్నారా? అన్న విషయాలను కూడా లోతుగా ఆరా తీస్తున్నారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు, ఇంజనీరింగ్ శాఖల అధికారుల ఉమ్మడి బృందం వేటజంగాలపాలెంలోని పలు క్వారీల్లో తనిఖీలు నిర్వహించి అనుమతి లేకుండా కంకర రవాణా చేస్తున్న మూడు లారీలను సీజ్ చేయడమే కాకుండా మరో మూడు వాహనాలకు భారీ మొత్తంలో జరిమానా విధించారు.



అనకాపల్లి మండలం మార్టూరులో ఓ క్వారీని తనిఖీ చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

### వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా మైనింగ్

వైసీపీ అధికారంలో వున్నప్పుడు అనకాపల్లి మండలం మార్టూరు, మాకవరం, బవులువాడ, ఊడేరు, మామిడిపాలెం, కుంచంగి, రొంగలివానిపాలెం, సీతానగరం గ్రామాల పరిసరాల్లోని క్వారీల్లో గనుల శాఖ నుంచి అనుమతులతో పనిలేకుండా యథేచ్ఛగా కొండలను పిండిచేసి, బండరాళ్లు, రోడ్డు మెటల్‌ను తరలించుకుపోయారు. కనీసం గ్రామ పంచాయతీల అంగీకార తీర్మానాలు కూడా లేవు. రాయల్టీగా ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత.. గతంలో వైసీపీ నాయకులకు డబ్బులు ఇచ్చి తమ గుప్పెట్లో పెట్టుకున్నట్టుగానే ఇప్పుడు కూటమిలో ఒక పార్టీకి చెందిన నాయకులను కాసులతో లోబరుచుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక నేతల ఆమోదంతో (గనుల శాఖ నుంచి అనుమతులు లేకుండా) క్వారీల్లో నుంచి నల్లరాయి, రోడ్డు మెటల్, కంకర వంటి వాటిని యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. మరికొంతమంది కొద్దిపాటి విస్తీర్ణానికి అనుమతి పొంది, రెట్టింపు ప్రదేశంలో మైనింగ్

... మిగతా 8వ పేజీలో

## గంజాయి రవాణాదారులపై షీట్లు

**వినియోగదారులపై కూడా...**

- ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలతో డీఐజీ గోపీనాథ్ జెట్టి వీడియో కాన్ఫరెన్స్
- మహిళల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిందిగా ఆదేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

గంజాయి రవాణాదారులు, వినియోగదారులపై షీట్లు ఓపెన్ చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలతో ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ గంజాయి రవాణాదారులు, విక్రయదారుల ఆస్తుల స్వాధీనం, పీడీ యాక్టు నమోదు, కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందేలా చూడాలన్నారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోక్సో, మహిళలపై దాడుల కేసులను త్వరగా విచారణకు తీసుకువెళ్లాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఇంకా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారం, సైబర్ నేరాలు, నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు, ఇతర కేసులపై డీఐజీ సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీలు తుహిన్ సిన్హా, జిందాల్, అమిత్ బర్దార్, కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్వీ మాధవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొని యువకుడి దుర్మరణం
- లారీ ఢీకొని వృద్ధుడి మృతి

ఎలమంచిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి మండలంలో బుధవారం సాయంత్రం రెండుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. పాతజాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొనడంతో ఒక యువకుడు చనిపోయాడు. లైనుకొత్తూరు గ్రామం రామకృష్ణాపురం కాలనీ వద్ద

... మిగతా 8వ పేజీలో



బాలచెంచమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు. (ఇన్‌సెట్‌లో) ఆలయంలో బాలచెంచమ్మ అమ్మవారు

## ఘనంగా బాలచెంచమ్మ తీర్థమహోత్సవం

రావికమతం మండలంలో గర్నికం బాలచెంచమ్మ తీర్థమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం తెల్లవారుజామునే భక్తులు బారులు తీరారు. చాలా సేపు కిలోమీటరు మేర భక్తులు క్యూ లైన్‌లో నిల్చున్నారు. అమ్మవారికి చీరలు, రవికలు, అరటి గెలలు, గాజులు, పసుపు కుంకుమలతోపాటు పలు కానుకలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా బీఎన్ రోడ్డుపై ట్రాఫిక్‌ను మళ్లించారు.

# నిరుపయోగంగా ఏటీఎల్

**గత ప్రభుత్వ నిర్వాకంతో మూలపడిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు**

అచ్యుతాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

**విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సుమారు తొమ్మిదేళ్ల క్రితం 'అటల్ ఇన్నోవేషన్ మిషన్' కింద పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్ నిరుపయోగంగా మారాయి. జిల్లా మూడు పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేయగా, గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా అన్నీ మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం వీటిని పునరుద్ధరించి, పాఠశాలల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.**

- తొమ్మిదేళ్ల క్రితం పూడిమడక, గణపర్తి, తాళ్లపాలెం పాఠశాలల్లో ఏర్పాటు
- యువతలో సాంకేతిక నైపుణ్యం పెంచడానికి దోహదం
- ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి వైసీపీ ప్రభుత్వం తూట్లు
- ఏటీఎల్‌ను వినియోగంలోకి తేవాలని కూటమి ప్రభుత్వానికి వినతి



అచ్యుతాపురం మండలం పూడిమడక పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో నిరుపయోగంగా ఉన్న పరికరాలు

పాశ్చాత్య దేశాలతో పోటీ పడాలంటే నైపుణ్యంగల యువతను తయారుచేయాలన్న ఉద్దేశంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సుమారు తొమ్మిదేళ్ల క్రితం 'అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం 2.0)ని ఏర్పాటు చేశారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ఇది ఎంతో దోహదపడుతుంది. ఏఐఎంలో భాగంగా పాఠశాలలకు అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్), పాలిటెక్నిక్, ఐటీఐలకు అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్స్ (ఏసీఐసీ), యూనివర్సిటీల విద్యార్థులకు అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఏఐసీ)లు నెలకొల్పారు. స్టార్టప్ ఎకో సిస్టం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకో సిస్టం నెలకొల్పటం వీటి ముఖ్యఉద్దేశం. అలాగే పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థుల్లో పారిశ్రామిక విప్లవం 4.0 సాంకేతికలపై శిక్షణ ఇవ్వడం, నూతన ఆలోచనలకు నాంది పలకడం, నూతన ఆవిష్కరణలను ఆచరణలో పెట్టడం కూడా ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇంకా జాతీయస్థాయిలో ఇన్నోవేషన్ హ్యాక్‌థాన్‌లు, నమూనా ప్రాజెక్టుల మారథాన్‌లలో పాల్గొనడానికి ఏఐఎం చేయూతనిస్తుంది. ఏటీఎల్ ఏర్పాటుకు రూ.20 లక్షలు ఏసీఐసీకి రూ.5 కోట్లు, ఏఐసీకి రూ.10 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్‌గా ప్రభుత్వం ఇస్తుంది. ఏటీఎల్‌కి ఎంపిక చేసిన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు మంజూరు చేస్తుంది.

ఏఐఎం, ఏసీఐసీకి నివేదించిన ప్రాజెక్టు రిపోర్టు ఆధారంగా ఎంపిక చేస్తారు. ప్రస్తుత అనకాపల్లి జిల్లాలో ఏటీఎల్ కింద పూడిమడక, గణపర్తి, తాళ్లపాలెం పాఠశాలలను అప్పట్లో ఎంపిక చేశారు. విద్యార్థుల శిక్షణకు అవసరమైన పరికరాలు సరఫరా అయ్యాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం దీనిపై శ్రద్ధ చూపకపోవడంతో పరికరాలన్నీ వృథాగా మారాయి. వీటిని అందుబాటులోకి తేవడంతోపాటు ప్రతి మండలంలో ఒక పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు చిన్నతనంలోనే సాంకేతిక పరిజ్ఞానం అలవరుతుందని విద్యావేత్తలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### సాంకేతిక సహకారానికి సిద్ధం



అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు అవసరమైన సాంకేతిక సహకారం అందివ్వడానికి మేము సిద్ధంగా వున్నాం. కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ వంటి అంశాలమీద శ్రీకాకుళం నుంచి కాకినాడ వరకు కేంద్రీయ విద్యాలయాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నాం. ఏటీఎల్‌కు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్, కృత్రిమ మేధ, వర్చువల్ రియాలిటీ, డ్రోన్ టెక్నాలజీ, రొబోటిక్స్ వంటి సాంకేతిక అంశాల మీద అవగాహనతోపాటు శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా వున్నాం.

ధర్మిరెడ్డి ప్రసాద్,
ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు టీడీపీ, జనసేన మద్దతు

- ఆయన గెలుపు కోసం క్యాడర్ కృషిచేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా పిలుపు



సంఘీభావంగా చేతులు కలిపిన టీడీపీ నాయకులు పల్లా, శ్రీభరత్, చిరంజీవిరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు తెలుగుదేశం, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వనున్నట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. బుధవారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉత్తరాంధ్ర సమస్యలపై పోరాటం చేసే వ్యక్తిగా రఘువర్మకు పేరు ఉందని, ఆయన గెలుపునకు టీడీపీ, జనసేన క్యాడర్ కృషిచేయాలని పిలుపునిచ్చారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, రఘువర్మ వంటివారు శాసన మండలిలో ఉంటే విద్యా రంగ సంబంధమైన అంశాలపై మంచి నిర్ణయాలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ ఒక పర్యాయం శాసన మండలి సభ్యునిగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషిచేశానని, మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తనకు తెలుగుదేశం, జనసేన మద్దతు ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అప్పలనరసింహం సేవలు మరువలేం



మాజీ ఎంపీ అప్పలనరసింహం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూటమి శ్రేణులు

మునగపాక, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గవర సామాజిక వర్గ ఉనికిని ఢిల్లీ స్థాయికి తీసుకు వెళ్లిన ఘనత మాజీ ఎంపీ దివంగత పెతకంశెట్టి అప్పలనరసింహనకు దక్కుతుందని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పేర్కొన్నారు. మండలంలో నాగులాపల్లిలో అప్పలనరసింహం 89వ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నాగులాపల్లిలో జన్మించిన అప్పలనరసింహం ప్రజా గళాన్ని పార్లమెంట్‌లో వినిపించారన్నారు. అప్పలనరసింహం విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అ ప్పలనరసింహం మనమడు మౌర్య, 89వ డివిజన్ కార్పొరేటర్ దాడి రమేశ్‌నాయుడు, టీడీపీ, జనసేన మండల పార్టీలు అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశరాం, దాడి మునిలినాయుడు, మళ్ల వరహానరసింగరావు, సుందరపు వెంకట కనకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## వంద రకాల వంటకాలతో కొత్త అల్లుడికి విందు



భోజనం చేస్తున్న వధూవరులు

బుచ్చయ్యపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కొండపాలెం గ్రామంలో మచ్చకర్ల అప్పారావు, లక్ష్మి దంపతులు కొత్త అల్లుడికి ఘనంగా విందు ఏర్పాటు చేశారు. ఈ నెల 16వ తేదీన పెదమదిన గ్రామానికి చెందిన గరికి సురేశ్‌కు, కుమార్తె కృష్ణ లావణ్యను ఇచ్చి వివాహం జరిపించారు. కుమార్తెతో కలిసి బుధవారం ఇంటికి వచ్చిన అల్లుడు సురేశ్‌కు వంద రకాల పిండి వంటకాలతో అప్పారావు, లక్ష్మి దంపతులు విందు ఏర్పాటు చేశారు. అత్తమామల ఆదరణకు అల్లుడు ఉక్కిరిబిక్కిరయ్యాడు.

## నేడు విద్యుత్ సరఫరాకి అంతరాయం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 10నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మోసయ్యపేట బర్మాకాలనీ, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ, ఆర్‌ఆర్ కాలనీ, దిబ్బపాలెం, వెంకటాపురం సెంటర్, మార్టూరు రోడ్, అచ్యుతాపురం జంక్షన్, సాయిప్రియ లేఅవుట్‌ల వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ఏపీఐఐసీకి భూములు ఇచ్చేది లేదు

- అధికారుల అభిప్రాయ సేకరణలో స్పష్టంచేసిన గొరపూడి పంచాయతీ ప్రజలు



రైతులతో అభిప్రాయాలను తెలుసుకుంటున్న ఏపీఐఐసీ ఎస్‌డీసీ అనిత

రాంబిల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొరపూడి పంచాయతీలో ఏపీఐఐసీ తలపెట్టిన భూ సేకరణను విరమించుకోవాలని గొరపూడి పంచాయతీ పరిధిలోని రైతులు డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాలపై ఏపీఐఐసీ డిప్యూటీ కలెక్టర్ ఎస్.డి. అనత, అధికారులు అప్పన్నపాలెంలో గొరపూడి పంచాయతీ రైతులతో బుధవారం సమావేశమయ్యారు. ముందుగా ఎస్‌డీసీ అనిత మాట్లాడుతూ గొరపూడి పంచాయతీలో పేజ్ 1,2ల్లో సుమారు 600 ఎకరాలు రైతుల నుంచి భూ సేకరణ చేసేందుకు 2006లో నోటిఫికేషన్ జారీచేశారని, అయితే, భూములు ఇవ్వమంటూ కోర్టును రైతులు ఆ శ్రయించారన్నారు. 2013 కొత్త చట్టం ప్రకారం ఎకరాకు రూ.13. 75లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. రైతులు ముందుకు రాకపోవడంతో అప్పటి కలెక్టర్ రూ.20లక్షలు నష్టపరిహారం ఇస్తామని, రైతులు ముందుకు వచ్చి భూసేకరణకు సహకరించాలని కోరినా స్పందన లేకపోయినట్టు వివరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రైతులు భూసేకరణకు సహకరించాలని కోరారు. అనంతరం రైతులు తమ అభిప్రాయాలను ఎస్‌డీసీకి తెలియజేశారు. భూములు కావాలంటే ఇందుకు అనుగుణంగా తమకు భూమి ఇవ్వాలన్నారు. భూ సేకరణలో ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీతో తమ కుటుంబాలను పోషించుకోలేమని, అన్ని విధాల ఇబ్బందులు పడతామని ఎస్‌డీసీకి వివరించారు. ఇప్పటికే ఎస్‌ఈజెడ్‌కు భూములు ఇచ్చిన రైతుల పరిస్థితి ఎలా ఉందో చూస్తున్నామని, ఈ స్థితిలో అధికారులు తమ భూములు జోలికి రావద్దని స్పష్టంచేశారు. అనంతరం ఎస్‌డీసీ అనిత మాట్లాడుతూ- రైతుల అభిప్రాయాలను, సమస్యలను జిల్లా కలెక్టర్‌కు తెలియజేసి వారి ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జడ్‌ఎం ఎస్. నరసింహారావు,రాంబిల్లి డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఆర్ఐ రవికుమార్, ఎస్ఐ నాగేంద్ర, గ్రామ నాయకులు లాలం తాతబాబు, రుత్తల గణేశ్వరరావు, లాలం చినసత్యం, గొరపూడి పంచాయతీ పరిధిలోని ప్రజలు పాల్గొన్నారు.

## జంపపాలెంలో హిందీ భాషా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి

ఎలమంచిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ భాష ఔన్నత్యం పై వ్యాస రచన, హిందీ గేయాల పోటీలు నిర్వహించారు. భాష ప్రాముఖ్యతను హెచ్‌ఎం. శాస్త్రి, ఉపాధ్యాయులు బొడ్డేటి సత్యనారాయణ తదితరులు వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ ఉపాధ్యాయులు వెంకట శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐస్ క్రీం వాహనం బోల్తా పడి ఒకరికి గాయాలు

పెదబయలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఐస్ క్రీం వాహనం బోల్తా పడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండంలోని సీతగుంట జంక్షన్‌కు చెందిన బీసై చంద్రశేఖర్ ఐస్ క్రీమ్‌లు విక్రయిస్తూ జీవిస్తుంటారు. బుధవారం లబ్బరి గ్రామంలో జరుగుతున్న శుభకార్యం వద్ద ఐస్‌క్రీమ్ విక్రయించటానికి వెళుతున్న క్రమంలో మలుపు వద్ద అతని బొలేరో వాహనం మొరాయించింది. కిందకు దిగిన ఆయన వాహనం జారిపోకుండా రాయి అడ్డంపెట్టే క్రమంలో ఆ వాహనం అతనిపై పడింది. అటుగా వెళ్తున్న వాహనచోదకులు చంద్రశేఖర్‌కు బయటకు తీశారు. సమయంలో వాహనంలో సాయంగా వచ్చిన ఓ బాలుడు ఉన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన చం ద్రశేఖర్‌కు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ ప్రథమ చికిత్స అందించారు. చేయి, తలకు బలమైన గాయాలు కావడంతో అతనిని మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## విగ్రహాలకు క్షీరాధివాసం



కొత్తపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట చారిత్రాత్మక రామలింగేశ్వర స్వామి నూతన ఆలయం ప్రారంభ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం విగ్రహాలకు క్షీరాధివాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తుల సమక్షంలో వేద పండితులు బ్రహ్మశ్రీ కృష్ణ శర్మ, భాగవతుల శ్రీనివాస శర్మల పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 35 ద్రవ్యాలతో దేవతామూర్తుల విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ రమాకుమారి, బి.ఎస్. బంగారు శెట్టి, రంగాసాయి, పెద్దింటి సూర్యనారాయణమూర్తి, కరెడ్ల మల్లికార్జునరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

## కార్మికుడి ఆత్మహత్య

రాంబిల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలంకోడూరు గ్రామంలో లేబర్ రూమ్‌లో బుధవారం సాయంత్రం కోనసీమ జిల్లా ఆత్రేయపురానికి చెందిన గునుపూడి సురేశ్ (38) ఉరివేసుకొని మృతి చెందినట్టు స్థానిక ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. ఎస్‌ఈజెడ్‌లోని ఫార్మకంపెనీలో కూలీగా పనిచేస్తున్న సురేశ్‌కు అమ్మానాన్న మృతి చెందారు. మూడు సంవత్సరాల క్రితం ఆయన భార్యతో విడిపోయినట్టు చెప్పారు. మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది సదరు వ్యక్తి ఉంటున్న లేబర్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు..

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



రాంబిల్లి హైస్కూల్లో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాంబిల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంబిల్లి, వాడనర్సాపురంల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కన్వీనర్ గగన్‌కుమార్ మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య స్థాపన కోసం కృషిచేసిన పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు యువత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు సూరాడ ధర్మతేజ, ఎం.కోదండరావు, చోడిపల్లి రమణ, రవితేజ, కారే రాముడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రేమ సమాజాన్ని సందర్శించిన విద్యార్థులు



అనాథలకు పండ్లు, మందులు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కొక్కిరాపల్లి ప్రేమసమాజాన్ని బుధవారం స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సందర్శించారు. అనాధలకు పండ్లు, మందులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం చేపట్టారు. ఆపదలో ఉన్న వారికి తోడ్పాటు నందించాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ విద్యార్థులకు ఈసందర్భంగా సూచించారు. ప్రోగ్రాం అధికారి అర్జున అప్పారావు, అధ్యాపకులు డా. సుజాత, నాగలక్ష్మి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు శిక్షణ



బొమ్మలు ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటవురట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం రెండవ రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈవోలు రామారావు, జోషి మాట్లాడుతూ, జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగామొదటిబ్యాచ్‌లో కార్యకర్తలకు ప్రీ ప్రైమరీ బోధనపై అవగాహనకల్పించామన్నారు. చిన్నారులకు పుస్తకాలపైబొమ్మల ద్వారా బోధించాలని సూచించారు. ఆరేళ్లలోపు చిన్నారులకు అర్థమయ్యే రీతిలో చదువు చెప్పాలన్నారు. రిసోర్స్ పర్సన్స్ విలియమ్స్ అప్పారావు, విజయ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు మద్దతుగా ప్రచారం



రఘువర్మకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

నక్కపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా బుధవారం నక్కపల్లి మండలంలో ఓటరుకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.కొండలరావు, నక్కపల్లి మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణ, అప్పలరాజు, సంఘం ప్రతినిధులు రంగబాబు, బి.లక్ష్మణరావు, డి.నాగేశ్వరరావు, సూర్యారావు, రాజేశ్, సురేశ్, కిరణ్‌కుమార్,జగదీశ్, సత్తిబాబుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంటల నమోదుపై రెండు గ్రామాల రైతులకు అవగాహన



గుంటపల్లిలో యాప్ గురించి వివరిస్తున్న ఏవో ఆదినారాయణ

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటపల్లి, పెదరామభద్రపురం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ రైతులు అపరాల పంట కోతలు కోస్తున్న నేపథ్యంలో పాటించవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎన్‌పీ ఎస్ఎస్ యాప్‌పై వారికి అవగాహన కల్పించారు. ఈ యాప్ వల్ల ఉపయోగాలు, దీనిని ఎలా డౌన్‌లోడు చేసుకోవాలో తెలియజేశారు. యాప్ ద్వారా పంటలకు తెగుళ్ల సోకితే నివారణ చర్యలు ఎలా చేపట్టాలో తెలుసుకోవచ్చునన్నారు. రైతులంతా తప్పనిసరిగా రబీ పంటకు సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి త్వరితగతిన ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. ఫార్మరీ రిజిస్ట్రీ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ప్రోత్సహకాలు, పంటల నష్ట పరిహారాలు వంటివి అందుతాయన్నారు. ఏఈవో జ్యోత్స్న, వీఏఏ వందన తదితరులు పాల్గొన్నారు.

## శ్రీప్రకాష్ ఆయుర్వేద ఆసుపత్రిలో నేత్ర వైద్య విభాగం ప్రారంభం



నేత్ర వైద్య విభాగాన్ని ప్రారంభిస్తున్న మల్లికార్జున

పాయకరావుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీప్రకాష్ ఆయుర్వేద ఆసుపత్రిలో బుధవారం నేత్ర వైద్య విభాగం ప్రారంభమైంది. ప్రముఖ వ్యాపారవేత్త చక్కా మల్లికార్జున ఈ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నేత్ర వైద్య విభాగంలో డాక్టర్ ఎం.ఏసుమయ్య ప్రధాన వైద్యురాలిగా వ్యవహరిస్తారని, నేత్ర వైద్యానికి కావలసిన అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్ ఫౌండర్ ట్రస్టీ సీహెచ్‌వీకే నరసింహరావు, సాయిగ్రామ్ ఆయుర్వేద హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (కోయంబత్తూరు) సీఈవో డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# పంట కాలువ గట్లు.. ఆక్రమణలు ఇట్లు..!

- పాయకరావుపేట మధ్యగా ప్రవహిస్తున్న ‘తాండవ’
- భూమి ఆనకట్ట నుంచి నక్కపల్లి మండలం ఉద్దండపురం వరకు ప్రవాహం
- గట్లను ఆనుకుని ఉన్న స్థల యజమానులు కొందరు అక్రమ నిర్మాణాలు
- నీరు పారేందుకు, ఏటా పూడిక తొలగింపునకు ఇబ్బందులు





బృందావనం శివారులో భూమి కాలువ గట్టును రోడ్డుగా మార్చిన దృశ్యం

పాయకరావుపేట, ఫిబ్రవరి 19 : పట్టణం మధ్యగా ప్రవహిస్తున్న పంట కాలువను పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా కాలువ గట్లు ఆక్రమణలపాలై కనుమరుగవుతున్నాయి. పాయకరావుపేటలో గల తాండవ నదిపై ఉన్న భూమి ఆనకట్ట నుంచి పట్టణం మీదుగా నక్కపల్లి మండలం ఉద్దండపురం వరకు గల సుమారు మూడు వేల ఎకరాలకు సాగుతో పాటు తాగునీరు ఈ కాలువ ద్వారా ప్రవహిస్తుంది. సుమారు రెండు కిలోమీటర్లున్న తాండవ నది గట్టు ఇప్పటికే పూర్తిగా ఆక్రమణలకు గురికాగా, పంట కాలువ గట్లు కూడా క్రమంగా ఆక్రమణదారుల గుప్పెట్లో చేరుతున్నాయి. ఈపంట కాలువ, పిల్లి మదుం కాలువ గట్లను ఆనుకుని ఉన్న స్థల యజమానులు కొందరు కాలువ గట్టును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ స్థలాల రేట్లు ఆకాశాన్నంటుతుండడంతో ఏ చిన్న స్థలం కనిపించినా అక్రమార్కులు విడిచిపెట్టడం లేదు. ఈక్రమంలో స్థానిక బృందావనం శివారులోని పంట కాలువ ఇరువైపులా లేఅవుట్లు వేసిన వ్యక్తులు ఆయా లేఅవుట్లలోని ప్లాట్లకు కాలువ గట్లనే రోడ్డుగా మార్చివేశారు. ఈ విలువైన స్థలాలు ఆక్రమణలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ, ఇరిగేషన్‌శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారు. ఈ కారణంగా నీరు ప్రవహించడానికి అడ్డంకులు ఎదురవుతుండడంతో పాటు పంట కాలువలో ఏటా పూడిక తీసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఆక్రమణలతో భవిష్యత్‌లో మరిన్ని అవస్థలు తప్పవని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంట కాలువ గట్లు ఆక్రమణకు గురికాకుండా దృష్టి పెట్టడంతో పాటు ఆక్రమణలు చేసేవారిపై చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి : డీఎంహెచ్‌వో



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంతో పాటు సమయ పాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.రవికుమార్ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం మధ్యాహ్నం సందర్శించారు. తొలుత అన్ని విభాగాలను పరిశీలించారు. పబ్లిక్ హెల్త్ లేబొరేటరీ మంజూరు కావడంతో దాని ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చే రోగుల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై వైద్యులతో పాటు సిబ్బందికి వివరించారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాయుడు, డాక్టర్ రాజేశ్వరి (ఈటీసీ), యూడీసీ రమేష్, ఫార్మసీ ఆఫీసర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న రాము

సబ్బవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో శివాలయం నిర్మాణానికి మాజీ సర్పంచ్ మండల సోమునాయుడు కుమారుడు రాము బుధవారం రూ.51,116లను విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరరావు, ప్రకాష్, బర్ల రమణ, బాదిరెడ్డి లక్ష్మణ, కొల్లి కృష్ణ, కనకరాజు, గెడ్డం కృష్ణ, కోరాడ శ్రీను, చింతల శ్రీనులు ఆయనను సత్కరించారు.

## నేడు త్రీ ఫేస్ సరఫరా సమయాల్లో మార్పు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పెద్దాపురం నుంచి పాయకరావుపేట వరకు ఉన్న 132 కేవీ లైన్ మరమ్మతు పనుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా సమయాల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి కార్యనిర్వాహక ఇంజనీర్ బుధవారం తెలిపారు. 220 కేవీ పరవాడ సబ్‌స్టేషన్‌లో గల వంద ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్‌కి సంబంధించిన హెచ్‌వీ సైడ్ పాత బ్రేకర్ స్థానంలో కొత్త బ్రేకర్‌ను మార్చనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా సమయాలు మార్చడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా అన్ని గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి గురువారం ఉదయం ఏడు గంటల వరకు, మరలా సాయంత్రం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించాలని కార్యనిర్వాహక ఇంజనీర్ తెలిపారు.

### వ్యవసాయ విద్యుత్ సరఫరాలో...

కోటవురట్ల : పరవాడ 220 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్త సూర్క్యూట్ బ్రేకర్ అమరుస్తున్న కారణంగా గురువారం నుంచి శుక్రవారం వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని ఏపీఈడీసీఎల్ నర్సీపట్నం ఏఈ పీడీపీ రామకృష్ణారావు తెలిపారు. ఈ రెండురోజులు 132 కేవీ నర్సీపట్నం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే ప్రాంతాలలో నర్సీపట్నం గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, రోలుగుంట, కోటవురట్ల మండలాలు, కొత్తకోట సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు సరఫరా వేళల్లో మార్పులు ఉంటాయన్నారు. గురువారం తెల్లవారు జాము ఒంటి గంటనుంచి ఉదయం ఏడు గంటల వరకు, మరల సాయంత్రం ఐదుగంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు, అలాగే 21వ తేదీ ఉదయం 11గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఇవ్వడం జరుగుతుందన్నారు. వినియోగదారులంతా ఈ మార్పును గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

# మూడు గ్రామాల కష్టాలకు మోక్షమెన్నడో?

- అస్తవ్యస్త రహదారితో గొటివాడ, రావలమ్మపాలెం, గుల్లేపల్లివాసులకు అవస్థలు
- ఐదేళ్లుగా ఇదే దుస్థితి ఉన్నా పట్టని పాలకులు
- సుమారు ఎనిమిది కి.మీ. రోడ్డుపై నిత్యం భయం..భయంగా రాకపోకలు
- ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని వేడుకోలు



గొటివాడ- రావలమ్మపాలెం గ్రామాల మధ్య రోడ్డుపై రాళ్లు తేలిన దృశ్యం

సబ్బవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లుగా ఆ మూడు గ్రామాల ప్రజలు రహదారికి మరమ్మతులు చేపట్టండి మహాప్రభో అంటూ.. మొరపెట్టుకుంటున్నారు. అయినప్పటికీ చెవిన వేసుకునేవారు లేకపోవడంతో రాకపోకలకు నిత్యం నరకాన్ని చూస్తున్నారు. సబ్బవరం మండలంలోని చోడవరం రోడ్డులో గల న్యాయ విశ్వవిద్యాలయం నుంచి గొటివాడ మీదుగా అంతకాపల్లి, రావలమ్మపాలెం రోడ్డు, రావలమ్మపాలెం నుంచి పాతరోడ్డు- గుల్లేపల్లి రోడ్డుకు కలిసే రహదారి అత్యంత దారుణంగా ఉంది. సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర ఉన్న ఈ తారు రోడ్డు ఛిద్రమైంది. ఫలితంగా రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మారింత అస్తవ్యస్తంగా మారింది. దీంతో మూడు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గడిచిన ఐదేళ్లుగా ఇదే దుస్థితి ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు పాలకులు తమ ప్రసంగాల్లో ఈ రహదారి అభివృద్ధిపై ప్రసంగాలు చేయడమే తప్ప నిధులు మంజూరైన సందర్భాలు లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడెనమిది నెలలు గడుస్తున్నా వారు సైతం ఇటుగా దృష్టి సారించడం లేదని ఆ మూడు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రం సబ్బవరానికి వచ్చే ద్విచక్ర వాహనదారులు నిత్యం రకాన్ని చూస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు వెలుతురు ఉంటుంది కనుక ఎలాగోల రాకపోకలు సాగిస్తున్నామని, రాత్రి వేళ మాత్రం చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెపుతున్నారు. రోడ్డు ఎక్కడో గుంత ఎక్కడో తెలియక తరచూ ప్రమాదాలకు గువుతున్నారని పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి ఈ రహదారి మరమ్మతుకు చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు. ఈ సమస్యను ఆర్‌అండ్‌బీ జేఈ బాలరాజు వద్ద ప్రస్తావించగా, గొటివాడ నుంచి అంతకాపల్లి మీదుగా రావలమ్మపాలెం మీదుగా గుల్లేపల్లి-పాతరోడ్డుకు కొత్త లేయర్ వేసేందుకు రూ.70 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని వివరించారు.





రావలమ్మపాలెం రోడ్డు నుంచి పాతరోడ్డు-గుల్లేపల్లి వెళ్లే మార్గంలో...

## మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు వినతి



డీఆర్‌వోకు వినతిని అందజేస్తున్న ప్రతినిధులు

తుమ్మపాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారంలో తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. అయితే నేటికీ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. దీంతో లక్షలాది మంది నిరుద్యోగులు ఆశగా ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు పోస్టుల ఎంపిక విషయంలో అన్యాయం జరిగిందని ఆరోపించారు. తక్షణమే మెగా డీఎస్సీపై ప్రభుత్వం స్పందించకుంటే ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం నిరుద్యోగ యువతీ యువకులతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు డొక్కరి హరీష్, బి.బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## '4న ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులు ఆందోళన'




చోడవరం బస్టాప్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఆటో డ్రైవర్లు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి నాలుగో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులు ఆందోళన చేపట్టనున్నారని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనరావు తెలిపారు. పెద్ద సంఖ్యలో అంతా పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. పట్టణంలోని చోడవరం బస్ స్టాప్ వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, చదువుతున్న ఆటో డ్రైవర్ల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తామని తదితర హాలు ఇచ్చారన్నారు. కానీ నేటి వరకు అమలు చేయడం లేదని వాపోయారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా ప్రభుత్వం రూ.15వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఫెడరేషన్ నాయకులు పి.నాగేశ్వరరావు, కె.చిరంజీవి, ఎం.శ్రీను, డి.సింహాచలం నాయుడు, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 'టీడీపీలో సీనియర్ కార్యకర్తలకు న్యాయం చేయండి'



పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న సీనియర్ కార్యకర్తలు

కొత్తూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం సీనియర్ కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు పలువురు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు బుధవారం విశాఖలో ఆయనను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనకాపల్లిలో టీడీపీ కార్యకర్తలను గుర్తించే సరైన నాయకత్వం లేకపోవడం బాధాకరమన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు పార్టీ కోసం, అభ్యర్థుల విజయానికి కృషి చేశామని వివరించారు. ప్రస్తుతం అనకాపల్లిలో భజనపరులు, పార్టీలు మారి వచ్చిన వారికి పదవులు వరిస్తున్నాయని, నిజమైన కార్యకర్తలు తీవ్ర అన్యాయం జరుగుతోందని వాపోయారు. తమ ఆవేదనను తెలియజేసేందుకు ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, మంత్రి, ప్రధాన కార్యదర్శి లోకేశ్‌లను కలిసే అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు బోడి వెంకటరావు యాదవ్, మాజీ కౌన్సిలర్ కుప్పిలి జగన్మోహనరావు, ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణదొర, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుడాల సత్యనారాయణ ముదిరాజ్, మళ్ల శివన్నారాయణ, భరణికాన శ్రీనివాసరావు, పి.సత్తప్పారావు, పారిపల్లి శ్రీనివాసరావు, కొమ్మర్తి నారాయణ, డీవీవీ అప్పారావు, మళ్ల గణేశ్, కర్రి మల్లేశ్వరరావు, సాలాపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## డైట్‌లో 'రీసెర్చ్ ట్రెండ్స్' పుస్తకావిష్కరణ



విద్యార్థులు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రత్నాకర్, తదితరులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు రాసిన 'రీసెర్చ్ ట్రెండ్స్ అండ్ అప్లికేషన్స్ ఇన్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ఎరా' అనే పుస్తకాన్ని బుధవారం కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ యొక్క అధునాతన టెక్నాలజీస్, అప్లికేషన్స్, భవిష్యత్తు అవకాశాలను సాంకేతికత భవిష్యత్తును రూపొందిస్తుందన్నారు. ఏఐ టెక్నాలజీని మరింత అభివృద్ధి చెందేలా ఆలోచన చేయాల్సిందిగా విద్యార్థులకు సూచించారు. సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ కె.సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్‌రెడ్డి, డీన్ అడ్మిన్ డాక్టర్ కె.ఈశ్వరరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## లంకెలపాలెం కూడలిలో క్షీణించిన పారిశుధ్యం



ఎస్‌బీఐ సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

లంకెలపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం కూడలిలో పారిశుధ్యం క్షీణించింది. స్థానికంగా గల దుకాణ సముదాయాల వెనుక పెద్దఎత్తున చెత్త కుప్పలు పేరుకుపోయాయి. డ్రైనేజీల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగు ముందుకు పారని పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా స్థానికంగా ఎస్‌బీఐకు వచ్చే ఖాతాదారులతో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే జీవీఎంసీ అధికారులు స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

## ఊరూరా.. ఆధ్యాత్మిక వేడుకలు



విజయరామరాజుపేటలో మరిడిమాంబ ఆలయం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజుపేటలో మరిడిమాంబ జాతరను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా భారీఏర్పాట్లు చేపట్టినట్టు కమిటీ ఛైర్మన్ ఆళ్ల శివరామసత్యనారాయణ తెలిపారు. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. రాత్రికి పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

### నేడు కనకదుర్గమ్మ అమ్మవారి అనుపోత్సవం



సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం ప్రజల ఆరాధ్య దేవత కనకదుర్గమ్మ అమ్మవారి అనుపోత్సవం గురువారం నిర్వహించేందుకు కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణతో పాటు అర్చనలు జరిపిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు.



పరవాడపాలెంలో సీతారాముల విగ్రహాలకు కొణతాల పూజలు

సాయంత్రం జరగనున్న అనుపోత్సవాన్ని మేళతాళాలు, బాజాభజంత్రీలు, కాళీమాత వేషధారణలు, తపెట్టగుళ్ల తదితరాల నడుమ కోలాహల వాతావరణంలో నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

### ఘనంగా సీతారామాంజనేయస్వామి తీర్థం

మండలంలోని నారపాడు శివారు అమ్ములపాలెంలో సీతారామాంజనేయ స్వామి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామి వారికి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గ్రామ పెద్దలు గొర్లి నూకరాజు, తానుబిల్లి కనకరాజు, సంధ్రాన సురేష్, ఆకుల కుమార్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. ఇదిలావుంటే, అనకపల్లిలోని ఆలయంలో శుక్రవారం ఉదయం గణపతి, సుబ్రహ్మణ్య నవగ్రహ సహిత అన్నపూర్ణ సమేత, కాశీవిశ్వేశ్వరస్వామి విగ్రహ యంత్ర ప్రతిష్ఠా మహోత్సవం జరగనుందని ఆలయ ధర్మకర్త కాపుశెట్టి శేషుబాబు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

కశింకోట : మండలంలోని పరవాడపాలెంలో సీతారాముల ఆలయ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదర్శ దంపతులకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు



కశింకోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మేధాబివృద్ధి, బాషాబివృద్ధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో మూర్తి అన్నారు. సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ ఏర్పాటైన శిక్షణ శిబిరంలో దిశానిర్దేశం చేశారు. మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు శారీరకాభివృద్ధి, మేధాబివృద్ధి, భాషాభివృద్ధి, సృజనాత్మకతపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. అలాగే. భాష, గణితంపై వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆరుగురు డీఆర్‌పీలు, ఇద్దరు కేఆర్‌పీలు హాజరై పలు అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేష్‌కుమార్, ఏసీడీపీవో శశికళ, డీఆర్‌పీలు ఝాన్సీరాణి, వంశీప్రియ, సుచరిత, కేఆర్‌పీలు రామునాయుడు, దేముడుబాబు, శివశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీలు

## 'వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ'



శివాజీ చిత్రపటం వద్ద వైస్ ప్రిన్సిపాల్ శంకర్ నివాళి

సబ్బవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ అన్నారు. కళాశాలలో శనివారం ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. శివాజీ శక్తియుక్తులు, ధీరత్వం నేటి యువతకు ఆదర్శమన్నారు. సంప్రదాయాల పరిరక్షణకు మొఘల్ చక్రవర్తులతో అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వీవీ గోపాలకృష్ణ, ఎంవీ రామకృష్ణ, డాక్టర్ లెక్కల గణేశ్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 908 మంది హాజరు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు ఉదయం, మధ్యాహ్నం కలిపి మొత్తం 908 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. 415 మంది గైర్హాజరయ్యారన్నారు. ఉదయం జరిగిన పరీక్షకు 287 మందికి, 283 మంది, మధ్యాహ్నం 636 మందికి 625 మంది హాజరైనట్టు చెప్పారు. పకడ్బందీ ఏర్పాట్లు నడుమ పరీక్షలు జరుగుతున్నట్టు చెప్పారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు మద్దతుగా ప్రచారం



నంగినారపాడు జెడ్పీ హైస్కూల్ ప్రచారంలో పాల్గొన్న ఫెడరేషన్ ప్రతినిధులు

సబ్బవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మను గెలిపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథరావు పిలుపునిచ్చారు. మండంలోని నంగినారపాడు, ఆరిపాక, రావలమ్మపాలెం, తవ్వవానిపాలెం, మలునాయుడుపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లు, సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్, కేజీబీవీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఆయా విద్యాలయాలకు వెళ్లి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. ఫెడరేషన్ మండల ప్రధాన కార్యదర్శి లెక్కల హేమంత్ సుదేవ్, ఎడ్ల దత్తాత్రేయ, వి.కోటేశ్వరరావు, వివిజయరామ్, షేక్ కరీముల్ల తదితరు పాల్గొన్నారు.

## 'నిత్యం యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం'

కొత్తూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలోని జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం ప్రత్యేక యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. హరిద్వార్ పతంజలి యోగా పీఠం నుంచి స్వామి రితిదేవ్ మహారాజ్ హాజరై యోగా వల్ల కలిగే ప్రయోజనాలు, ఆసనాలు, ఆహారపు అలవాట్లను వివరించారు. నిరంతరం ఈ పద్ధతులను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారవచ్చని వివరించారు. అనంతరం అసిస్టెంట్ యోగా టీచర్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జార్జిక్లబ్ అధ్యక్షుడు బీఎస్‌ఎంకే జోగినాయుడు, యోగా గురువులు దొరమ్మనాయుడు, మెడిటేషన్ గురువు మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పది గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

సబ్బవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతకా పల్లి సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పది గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అంతకాపల్లి, రావులమ్మపాలెం, టిక్కలిపాలెం, నాయనమ్మపాలెం, అడ్డూరు, గొటివాడ, లగిశెట్టిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 15 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

కొత్తూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని పూల్‌బాగ్ జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని బుధవారం పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ దాసరి ఈశ్వరరావు తెలిపారు. గవరపాలెం ప్రాంతానికి చెందిన కె.వెంకట వరహానూక సత్యనారాయణ పదిహేను మద్యం క్వార్టర్ బాటిళ్లను తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని, అరెస్టు చేశామన్నారు.

## 22న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఈపీడీసీఎల్ అనకాపల్లి డి-2 సెక్షన్ కార్యాలయంలో ఈనెల 22న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్టు ఈపీడీసీఎల్ అధికారి డీవీఆర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీజీఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక విభాగం సభ్యులు బి.సులేఖరాణి, ఆర్థిక విభాగం సభ్యులు షేక్ బాబర్ హాజరుకానున్నారన్నారు. విద్యుత్ వినియోగదారులు విచ్చేసి తమ సమస్యలను పరిష్కరించు కోవాల్సిందిగా ఆయన కోరారు.

## పరవాడ మండల సమావేశం రేపు

పరవాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ధర్మారావు తెలిపారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

## సీపీఐ నాయకుడు భద్రానికి ఎమ్మెల్యే కొణతాల పరామర్శ



భద్రాన్ని పరామర్శిస్తున్న కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్ర జ్యోతి) : తీవ్ర అనారోగ్యంతో గత కొంత కాలంగా చికిత్స పొందుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీపీఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రంను బుధవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మాజీ కౌన్సిలర్లు బీఎస్‌ఎంకే జోగినాయుడు, పీలా నాగశ్రీను, తాకాశి వెంకటేశ్వరరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## ఆటల పోటీల విజేతలకు బహుమతులు

పరవాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లిలో రామచంద్రమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వివిధ ఆటల పోటీల విజేతలకు మంగళవారం రాత్రి బహుమతులను ప్రదానం చేశారు. జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, కోలాటం పోటీల విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, నిర్వాహకులు కూండ్రపు శ్రీనివాస్, శ్రీరామ్మూర్తి, కె.మధు, సర్పంచ్‌లు బొద్దపు శ్రీనివాస్ కాసులు, మోటూరి సన్యాసినాయుడు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ సూపరింటెండెంట్‌కు పదోన్నతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్ర జ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎల్.సురేష్‌కు పదోన్నతి లభించింది. ఈయన సూపరింటెండెంట్‌గానే కాకుండా ప్రస్తుతం ఇన్‌చార్జి రెవెన్యూ ఆఫీసర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కొంతమందికి ప్రభుత్వం పదోన్నతి కల్పించడంతో సురేష్‌ను జీవీఎంసీ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా నియమించింది.

## పెదబయలులో రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి

**ఒకరికి క్షయ, మరొకరికి ఎనీమియా సమస్య**


క్షయ వ్యాధితో మృతి చెందిన నాగేశ్

పెదబయలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పెదబయలు పట్టణంలో రెండు రోజుల వ్యవధిలో క్షయ, ఎనీమియా వ్యాధులతో ఇద్దరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలివి.. స్థానిక సీ కాలనీకు చెందిన డడియ నాగేశ్ (33) కొద్ది రోజులుగా క్షయ వ్యాధి బారిన పడి మందులు వాడుతూ మంగళవారం సాయంత్రం స్వగృహంలో మృతి చెందారు. జీసీసీ గోదాము గల వీధిలో ఎనీమియాతో (రక్తహీనత) బాధపడుతున్న వివాహిత మఠం లక్ష్మి (30)పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఇలా వరుసగా ఇద్దరు మృతి చెందడానికి వైద్య శాఖ నిర్లక్షమే కారణమని వార్డు సభ్యులు గండేరు జీవన్‌కుమార్ ఆరోపించారు. ఇకనైనా సీతగుంట పంచాయితీలో 10 మంది, పెదబయలు పీహెచ్సీ పరిధిలో 29, మండల పరిధిలో 36 మంది క్షయ వ్యాధితో బాధపడుతున్నారనీ వారికి మందులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని వాపోయారు. పర్యవేక్షణ లోపంతోనే ఈ వ్యాధిగ్రస్థులు మృత్యువాతపడుతున్నారన్నారు.

## మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు


మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ సీఐ సంతోశ్

అనంతగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, అరకు ఎక్సైజ్‌శాఖ సీఐ సంతోశ్ సూచించారు. మండల కేంద్రంలోని సచివాలయం వద్ద ఎంపీడీవో ఏవీవీ.కుమార్ అధ్యక్షతన మహిళ పోలీసులతో సమావేశమయ్యారు. ఎక్సైజ్‌శాఖ నూతనం తీసుకువచ్చిన నవోదయం, 2.0 పథకాలపై అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సారా తయారుచేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోని ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.బాల్యవివాహాలు చేస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని ఎంపీడీవో ఏవీవీ కుమార్ హెచ్చరించారు.. మండల కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని మహిళ పోలీసులతో సమావేశమయ్యారు. బాల్య వివాహాల పేరుతో ఇద్దరి జీవితాలను నాశనమవుతాయన్నారు. గ్రామాల్లోవివాహాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

## అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి


మృతుడు దేముడు(ఫైల్)

కొయ్యూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత సమస్యతో మండలంలో బాలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న తుచ్చ దేముడు (50) బుధవారం ఉదయం మృతి చెందారు. దేముడు కొన్నేళ్లుగా హృద్రోగ సమస్య ఎదుర్కొంటూ, మూడు పర్యాయాలు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్నారు. ఇటీవల తిరిగి సమస్య తలెత్తింది. మరోసారి సర్జరీకి తగిన ఏర్పాట్లు చేస్తుండగా బుధవారం ఉదయం నర్సీపట్నంలో ఆయన నివాస గృహంలో అస్వస్థతకు లోనయ్యారు. కుటుంబ సభ్యులు అతనిని వైద్య సేవలకు తరలించే ప్రయత్నంలో మరణించారు. భార్య మాధురి నర్సీపట్నం బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు. దేముడు మృతితో స్వగ్రామమైన మండలంలో పెదమాకవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఐస్ క్రీమ్ వాహనం బోల్తా... ఒకరికి గాయాలు

పెదబయలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఐస్ క్రీం వాహనం బోల్తా పడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సీతగుంట జంక్షన్‌కు చెందిన బిసై చంద్రశేఖర్ ఐస్ క్రీమ్‌లు విక్రయిస్తూ జీవిస్తుంటారు. బుధవారం లబ్బురి గ్రామంలో జరుగుతున్న శుభకార్యం వద్ద ఐస్‌క్రీంవిక్రయించటానికి వెళుతున్న క్రమంలో మలుపు వద్ద అతని బొలేరో వాహనం మొరాయించింది. కిందకు దిగిన ఆయన వాహనం జారిపోకుండా రాయి అడ్డంపెట్టే క్రమంలో ఆ వాహనం అతనిపై పడింది. అటుగా వెళ్తున్న వాహనచోదకులు చంద్రశేఖర్‌కు బయటకు తీశారు. సమయంలో వాహనంలో సాయంగా వచ్చిన ఓ బాలుడు ఉన్నాడు. ప్రమాదంలో గాయపడిన చం ద్రశేఖర్‌కు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారినిఖిల్ ప్రథమ చికిత్స అందించారు. చేయి, తలకు బలమైన గాయాలు కావడంతో అతనిని మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## పది గంటలకు వదలని పొగమంచు

**జి.మాడుగులలో 13.9 డిగ్రీలు నమోదు**

పాడేరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం ఉదయం పది గంటల వరకు పొగమంచు వదలలేదు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నప్పటికీ పొగ మంచు కొనసాగుతున్నది. సహజంగా రథసప్తమి తర్వాత నుంచి వాతావరణంలోని మార్పులు సంభవించి ఎండ ప్రభావం పెరుగుతుంది. కానీ, ప్రస్తుతం అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. అలాగే ఉదయ పది గంటల వరకు పొగమంచు కమ్మేయడంతో వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నాయి. ఏజెన్సీలో బుధవారం జి.మాడుగులలో 13.9 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా చింతపల్లిలో 14.0, జీకేవీధిలో 14.3, పెదబయలులో 15.5, డుంబ్రిగుడలో 15.7, ముంచంగిపుట్టులో 15.9, పాడేరులో 16.0, అనంతగిరిలో 16.2, హుకుంపేటలో 16.8, కొయ్యూరులో 18.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## జీసీసీ ద్వారా మెరుగైన సేవలు

**ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ**


జీసీసీ అధికారులతో సమావేశమైన ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్‌గౌడ

పాడేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ ద్వారా గిరిజనులకు మెరుగైన సేవలు అందించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో జీసీసీ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ఉత్పత్తుల సేకరణ పై జీసీసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అలాగే జీసీసీ సేకరించిన అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి నిల్వలు, కొనుగోలు, విక్రయాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కాఫీ కొనుగోలు లక్ష్యం సాధించాలని, గిరిజన రైతు లకు జీసీసీ అందించిన రుణాల రికవరీ శ్రద్ధ పెట్టాలన్నారు. జీసీసీ డీఎంలు రేషన్ డిపోలను ప్రతినెలా తనిఖీ చేయాలని, డీఎంలు తమ సందర్శనలకు సంబంధించిన టూర్ డైరీలను ప్రతి నెలా ఐటీడీ ఏకు సమర్పించాలని ఆయన ఆదేశించారు. గతవారం పాడేరులోని ఒక రేషన్ డిపోను తనిఖీ చేస్తే, అక్కడ రికార్డులు సక్రమంగా నిర్వహించలేదన్నారు. వచ్చే ఏడాది గిరిజన ఉత్పత్తులు సేకరణకు ముందుగా కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేసి అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జీసీసీ రేషన్ డిపోలకు సొంత భవనాలు, అద్దె భవనాలు, భవన మరమ్మతులపై నివేదికలు సమర్పించాలని, జీసీసీ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా తగిన చర్యలు చేపట్టా లని సూచించారు. ఎండీయూ వాహనాల ద్వారా నిర్దేశించిన సమయానికి లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈసమావేశంలోఐటీడీఏ ఏపీవో ఎం. వెంకటేశ్వరరావు, పాడేరు, చింతపల్లి జీసీసీ డివిజనల్ మనేజర్లు డి.సింహాచలం, దేవరాజ్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ బి. వెంకటేశ్ పాల్గొన్నారు.

## హత్య చేసి కాల్చేశారు!

**కాపులుప్పాడ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి దహనం**

**హతుడు పెందుర్తి జ్యోతిష్కుడు మోతి అప్పన్నఅయి ఉండవచ్చునని అనుమానం**


అదృశ్యమైన జ్యోతిష్కుడు మోతి అప్పన్న (ఫైల్ ఫొటో)

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కాపులుప్పాడ వద్ద గల ఒక ప్రైవేటు లేఅవుట్‌లో వ్యక్తి శరీర భాగాలు కాలిపోయి చెల్లా చెదురుగా పడివుండడం కలకలం రేపింది. అవి పది రోజుల క్రితం అదృశ్యమైన పెందుర్తి బీసీ కాలనీ నివాసి, జ్యోతిష్కుడు మోతి అప్పన్న (50)వి అయి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. హత్య చేసి గుర్తుపట్టకుండా ఉండేందుకు దహనం చేసి ఉంటారని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తికి చెందిన అప్పన్న జ్యోతిష్కుడు. వృత్తి రీత్యా ఊళ్లు తిరుగుతుంటారు. అలాగే ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఆనందపురం వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. రాత్రికి తిరిగి రాకపోవడంతో మరుసటిరోజు పదో తేదీన ఆయన కుమారుడు దుర్గాప్రసాద్ ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు కింద నమోదుచేసిన పోలీసులు పరిసర గ్రామాల్లో గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తుండగా 9వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బోయపాలెం నుంచి చేపలుప్పాడ వైపు వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తి పల్సర్ 220 వాహనం వెనుక తన తండ్రి కూర్చుని ఉన్నట్టు తనయుడు దుర్గాప్రసాద్ నాలుగు రోజుల కిందట గుర్తించారు. అప్పటి నుంచి కాపులుప్పాడ-చేపలుప్పాడ మార్గంలో గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం గంభీరం గెడ్డ సమీపంలో ఉన్న ఆర్ఎన్‌పి లేఅవుట్‌లోని ఒక ప్లాట్ కాంపౌండ్‌లో ఉన్న చిన్న షెడ్డు వద్ద శవం కాల్చిన ఆనవాళ్లు కనిపించాయి. పరిసరాల్లో పుర్రె, చేతి, కాలి ఎముకలు పడి ఉన్నాయి. ఈ సమాచారాన్ని భీమిలి, ఆనందపురం సీఐలకు అందజేశారు. విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజుతో సీఐలు బొడ్డేపల్లి సుధాకర్, సీహెచ్ వాసునాయుడు, సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకున్నారు. శవం కాలిబూడిదైన ప్రదేశంలో పడి ఉన్న రుద్రాక్షలు, ఎరుపు, పసుపు పూసలు దండలు, కనకదుర్గమ్మ ఫొటో, ఆకుపచ్చ పంచె అవశేషం గుర్తించి అవన్నీ తన తండ్రివేనని దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. తన తండ్రిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి దహనం చేసి ఉంటారని విలపించారు. క్లూస్ టీమ్ సంఘటనా స్థలిలో లభ్యమైన ఆధారాలను సేకరించింది. కాగా, సంబంధిత ప్రహరీ లోపల గల షెడ్డు వద్ద రక్తపు మరకలు ఉండడాన్ని పోలీసులు గమనించారు. ఈ శరీర భాగాల అవశేషాలను పోలీసులు సేకరించారు. ఏసీపీ అప్పలరాజు మాట్లాడుతూ కాలిబూడిదైన శరీరం అప్పన్నదేనని ఆయన కుమారుడు, బంధువులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నందున ఆ దిశగా దర్యాప్తు చేస్తామన్నారు. త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు. కాగా, అప్పన్న కుమారుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తన చిన్నాన్న కుమారుడి పెండ్లికార్డులు పంచడానికి ఈనెల 8న విజయనగరం వెళ్లారని, అదేరోజు ఎవరితోనే ఫోన్‌లో ఎక్కువసేపు, గట్టిగా మాట్లాడడం గమనించానన్నారు. ఆ ఫోన్ కాల్‌పైనే అనుమానం ఉందన్నారు. దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమిలి పోలీసు సిఐ సుధాకర్ తెలిపారు.

## దోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు


వివరాలు తెలుపుతున్న డీఎస్పీ షేక్ షహబూబ్ అహ్మద్

అరకులోయ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కోడిపందాల అలవాటు పడిన ఓ యువకుడు చిన్నాన్న ఇంట్లో దాడి చేసి నగలు, డబ్బు దోచుకున్నాడు. చివరికి ఈ కేసులో సంబంధం ఉన్న ఆ యువకుడితోపాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పాడేరు డీఎస్పీ షేక్ షహబూబ్ అహ్మద్, స్థానిక సీఐ హిమగిరి బుధవారం స్థానిక విలేకరులకు ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. డుంబ్రిగుడ మండలంకొర్రాయి పంచాయతీ బోందుగుడకు చెందిన సూర్యప్రకాశరావు ఇంట్లో ఈ నెల 8న రాత్రి భార్య గీతారాణిని భయపెట్టి గుర్తు తెలియని ఐదుగురు రెండు బంగారు శతమానాలతో ఉన్న రోల్డుగోల్డ్ పుస్తెలతాడు, రూ. 30వేలు తీసుకుని పరారయ్యారు. వరుసకు కొడుకు అయిన సురేశ్ ఒడిశాకు చెందిన మరో నలుగురితో కలిసి ఈ చోరీకి పాల్పడినట్టు విచారణలో గుర్తించారు. ఈ కేసులో సురేశ్‌తోపాటు మనోజ్‌కుమార్ ఖోస్లా (24) అరెస్టు చేశారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన పాడేరు క్రైం టీమ్‌లోనిహెచ్‌సీలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, బెహరా, కానిస్టేబుల్ ప్రసాద్‌లకు నగదు రివార్డును డీఎస్పీ అందించి అభినందించారు.

## ఘనంగా సీతారాముల, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

జి.మాడుగుల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంబిడిసింగి పంచాయతీ గద్దెరాయిలో బుధవారం సీతారాముల సమేత ఆంజనేయ విగ్రహాలను బుధవారం ఘనంగా ప్రతిష్ఠించారు. విజయవాడకు చెందిన తలశీల శివరామకృష్ణ ప్రసాద్, జగ్గందొర మురళీ విగ్రహాలను అందజేశారు. గత మూడు రోజులుగా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి అనంతరం బుధవారం ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

## సమన్వయంతోనే నెరవేరనున్న ప్రభుత్వ ఆశయం


అవగాహన కల్పిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు

కొయ్యూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్య, మహిళ శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయడంతోనే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని సమగ్రశిక్ష ఏపీసీ స్వామినాయుడు సూచించారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండవ రోజు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఏపీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అమలుకు జ్ఞానజ్యోతి పేరిట ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాం బాబు, సీడీపీవో విజయకుమారి, డీఆర్పీలు సురేశ్‌కుమార్, తలుపులు, సూపర్‌వైజర్లు కనక మహాలక్ష్మి, బాలామణి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

**చింతపల్లి:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో పూర్వప్రాథమిక విద్య అం దించనున్నట్లు స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ రమణి తెలిపారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంను ఎంఈఓ పీవీవీ ప్రసాద్, సీడీపీఓ రమణి జ్యోతి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ- 2 బోడనాయుడు, హెచ్‌ఎం వి. అప్పారావు పాల్గొన్నారు.

## ప్రైవేట్ జీపు యూనియన్ నూతన అధ్యక్షుడిగా డొంకిన నాగు

పాడేరురూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదమాంబ జీపు ఓనర్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా డొంకన నాగు, వైస్ ప్రెసిడెంట్‌గా టి.ప్రసాద్, సెక్రటరీగా కె.నాగరాజు, జాయింట్ సెక్రటరీగా ఎస్.హరి, కోశాధికారిగా ఎం.అప్పారావు, కమిటీ ముఖ్య సభ్యులుగా జి.నాయుడు, వి.మహేష్, కె.సిద్ధు, గోవింద్, కె.మాధవరావు, డి.పొల్లునాయుడు, డి.శ్రీను, రాము తదితరులు సభ్యులు ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు యూనియన్ అధ్యక్షుడిగా లొట్టి త్రినాథ్(చిన్ని) అందించిసేవలను యూనియన్ నాయకులు, సభ్యులు అభినందించారు.

## 'గాదె'కే ఏపీటీడబ్ల్యూటీఏ మద్దతు


మాట్లాడుతున్న ఏపీటీడబ్ల్యూటీఏ అధ్యక్షుడు సూర్యనారాయణ

పాడేరురూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి(టీచర్స్ ఎమ్మెల్సీ) ఎన్నికలలో పీఆర్‌టీయూ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతోందని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు, ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మార్పు, మిగిలి ఉన్న భాషా పండితులు, పీఈటీ పోస్టుల ను స్కూల్ అసిస్టెంట్స్‌గా మార్పు, టీడబ్ల్యూ టీఏను ప్రభుత్వ గుర్తింపునకు కృషి, కామన్ సర్వీస్ రూల్స్ తదితర హామీలు ఇచ్చినందున టీడబ్ల్యూటీఏ శ్రీనివాసులు నాయుడుకు మద్దతు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో ఏపీటీడబ్ల్యూటీఏ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి గేదెల శేషగిరిరావు, గౌరవాధ్యక్షుడు చిట్టపులి శ్రీనివాసరావు పడాల్, జిల్లా శాఖ అధ్యక్షుడు కంబిడి నీలకంఠం, గౌరవాధ్యక్షుడు కుర్తాడి రామారావు, కార్యదర్శి ఎం.శోభన్ పాల్గొన్నారు.

### పీఆర్‌టీయూ నేతల ప్రచారం

హుకుంపేట: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసుల నాయుడు గెలిపించాలని పీఆర్‌టీయూ నేతలు గంజాయి గెను కంబిడి, సువర్ణరాజులు పిలుపు నిచ్చారు. బుధవారం మండలంలోని పె దగరువు అల్లంపుట్టు, బాకూరు, ఉప్ప, తదితర ఆశ్రమ పాఠశాలల్లో సంఘ డైరీలను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు అందించారు. ప్రచారం చేశారు. నాయకులు మన్మధరావు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా రైతుల రిజిస్ట్రేషన్

జి.మాడుగుల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ చేపట్టే రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో ముమ్మరంగా సాగుతోంది. ఈనెల 25 లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాల మేరకు సచివాలయాల పరిధిలోని గ్రామాల గిరిజన రైతులు తరలివస్తున్నారు. పీఎం కిసాన్, రైతు భరోసా చెల్లింపులకు ఆర్‌వోఆఫ్‌ఆర్, డీ ఫారం పట్టాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

## వాలీబాల్ క్రీడాకారుడికి గాయం

సీలేరు, ఫిబ్రవరి 19, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ చిన్నగంగవరానికి చెందిన కొర్రా ఆనందరావు బుధవారం సా యంత్రం వాల్‌బాల్ ఆడుతుండగా షాట్ కొట్టే క్రమంలో ప్రమాదవశాత్తు పడిపోయిన సంఘటనలో భుజంపై గాయమైంది. దీంతో తోటి క్రీడాకారులుఆనందరావును ధారకొండఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారి హిమబిందు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్య సేవలకు చింతపల్లి ఆసుపత్రికి రిఫర్ చేశారు.

## పశు వైద్య విద్యార్థులకు మద్దతు

అరకులోయ,ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని పశువైద్యనభ్యసిస్తున్న విద్యార్థులు గత 15 రోజులుగా స్టైఫండ్ పెంచాలని చేపడుతున్న నిరవధిక సమ్మెకు జిల్లా పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సాగరి గనేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో మద్దతు ప్రకటించారు. ఈ మేరకు జిల్లాలో పశువైద్యాధికారులంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నట్టు తెలిపారు. పశు వైద్యవిద్యార్థులకు ప్రతీ ఏటా పదిశా తం స్టైఫండ్ పెంచాలని నిబంధనలున్నా అమలు చేయడంలేదన్నారు. దీంతో విద్యార్థులు ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పేద విద్యార్థులపై ఆర్థిక బారం పడుతుందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి స్టైఫండ్‌ను పెంచి సమ్మెను విరమింపజేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పశువైద్యాధికారుల కొరత ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ పోస్టులు భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాడి రైతులు ఇబ్బందులు తొలగించాలని కోరారు.

## పెసా చట్టంపై అవగాహన అవసరం

పాడేరురూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పెసా చట్టంపై డ్వాక్రా గ్రూపు మహిళలు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు అన్నారు. పెసాకమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల పాటు డ్వాక్రా గ్రూపు మహిళలల నిర్వహిస్తున్న శిక్షణ కార్య క్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామర్లకోటకు చెందిన ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ పి.చంద్రశేఖర్, మాస్టర్ ట్రైనర్ వి.చిన్ని, నాగేశ్వరరావు, విజయబాబు, సత్యనారాయణ, కాసు, ప్రవీణ్ కుమార్, మనోహర్, సుధాకర్, అశోక్ చట్టంపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్‌ఆర్‌డీ ఆర్‌వీఎస్.రమేష్, ఏవో ఎ.మహేశ్వరరావు, ఎస్ఏ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**చింతపల్లి:** పెసా చట్టంపై గిరిజనులు అవగాహన పెంచుకోవాలని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషాదేవి అ న్నారు. స్థానికంగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర పరిశీలకులు నాగరాజు, చిన్నారావు, ఎంపీడీఓ శ్రీనివాస్, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు గోపీనాయక్, శారద, వెంగళరావు ఉన్నారు.

## బీఐఎస్ సైన్స్ శిక్షణతో విద్యా ప్రమాణాలు: డీఈవో



లెర్నింగ్ సైన్స్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) మేరకు సైన్స్ ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణతో విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం పెంపొందుతుందని డీఈవో పి.బ్రహ్మాజీరావు అన్నారు. బీఐఎస్ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలోని పాఠశాలల్లో స్టాండర్డ్ క్లబ్‌లకు మార్గ నిర్దేశం చేస్తున్న 11 పాఠశాలలకు చెందిన 33 మంది సైన్స్ ఉపాధ్యాయులకు అందిస్తున్న లెర్నింగ్ సైన్స్ వయా స్టాండర్డ్స్ (ఎల్ఎస్‌వీఎస్)పై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన స్థానిక కాఫీ హౌస్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌ను అర్థం చేసుకుని భోధించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం రూపొందించినట్టు చెప్పారు. విద్యార్థులు నిజజీవితంలో పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనేలా వారికి పాఠ్య ప్రణాళికలు ఒక సాధనగా ఉపయోగపడతాయన్నారు. బీఐఎస్ విజయవాడ సైంటిస్ట్, డిప్యూటీ డైరెక్టర్ డి.వివేకవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ శిక్షణ విద్యార్థులు సైన్స్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు సాయపడుతుందన్నారు. గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్. రజని, పీర్ వర్క్ స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ డి.కృష్ణ, జె. అనీల్‌కుమార్, ఎండీఎం జిల్లా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డి.రాంబాబు పాల్గొన్నారు.

## ఎరువులు , విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


చింతపల్లిలో ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ పాత్రుడు

చింతపల్లి, ఫిబ్రవరి 19 : గిరిజన ప్రాంతాల్లో ఎరువులు, విత్తనాలు , క్రి మిసంహారక మందులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పాడేరు వ్యవసాయ శాఖ ఏడీఏ ఎల్ఆర్‌బీ పాత్రుడు హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన బుధవారం చింతపల్లి వ్యసాయ సబ్ డివిజన్ పరిధిలో అధీకృత డీలర్లకు చెందని దు కాణ సముదాయాలు, గోదాములను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల నిల్వలు, ధరలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే వ్యాపారులు ధరలను అమలు చేయాలన్నారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఇన్‌చార్జి ఏవో మధుసూదనరావు, ఎరువులు విత్తనాలు అధీకృత డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రేగం అప్పలరాజు పాల్గొన్నారు.

## గిరిజనులకు ప్రయోజనం చేకూర్చేలా కేంద్ర బడ్జెట్

**మేధావుల సమావేశంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

పాడేరురూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025-26 బడ్జెట్ పేద, మధ్య తరగతి, గిరిజన వర్గాల ప్రజలకు అత్యంత ప్రయోజనం చేకూర్చేలా ఉందని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు అన్నారు. పాడేరులో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై ఏర్పాటుచేసిన మేధావుల సమావేశానికి హాజరయ్యారు. ఆయన ముం దుగా స్థానిక మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మేధావి వర్గాలు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో చర్చ గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి రూ. 15,000 కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంటుకు రూ. 3,295 కోట్లు, జీకో బడ్జెట్ నేచరల్ ఫార్మింగ్ కోసం రూ. 186 కోట్లు, ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి రూ. 162 కోట్లు, జల్ జీవన్ మిషన్ పథకానికి రూ. 67,000కోట్లు, మారుమూల గ్రామాల రహదారుల అభివృద్ధికి రూ. 19 వేల కోట్లు ఇలా. రాష్ట్రాభివృద్ధికి రూ. 57, 566 కోట్లు అందించినట్టు చెప్పారు. రాష్ట్రాభివృద్ధిపై ప్రధాని మోదీ సహకరిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు పోలవరం ప్రోజెక్టు, అమరావతి నిర్మాణం కోసం అధిక నిధులను కేంద్రం నుంచి తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా జిల్లా స్థాయి స్పోర్ట్సు మీట్


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అందజేసిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు

అరకులోయ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం ఒక్కరోజు జిల్లా స్థాయి స్పోర్ట్సుమీట్‌ను కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, విశాఖపట్నం నెహ్రూ యువకేంద్రం సం యుక్తంగా నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్, క్రీడాపాఠశాల ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎన్.మూర్తి, అనంతగిరి ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సన్యాసినాయుడు ,ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు ప్రారంభించారు. పలు మండలాల నుంచి విచ్చేసిన కళాశాలల విద్యార్థులకు కబడ్డీ , వాలీబాల్ , లాంగ్‌జంప్, హై జంప్ , 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు, పురుషుల, స్త్రీల విభా గంలో నిర్వహించారు. విజేతలకు ప్రశంశాపత్రాలతో పాటు పతకాలను ఎన్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ విశాఖపట్నం జి.మహేశ్వరరావు, స్పోర్ట్సు ఇన్‌చార్జి డాక్టర్ బి.సుభాన్ అందించారు. క్రీడా పాఠశాల కోచ్‌లు కె.గణపతి, రాజాబాబు,శ్రీను, స్వామి ,కళాశాలకు చెందిన పీడీ అప్పారావు ప్రసాద్‌ల పర్యవేక్షణలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు విజయలక్ష్మీ, అనితకుమారి, నాగబాబు ,కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. మిరాకిల్ ఎడ్యుకేషన్ అండ్‌హెల్త్ చారిటబుల్‌ట్రస్ట్ ప్రతినిధి ఎస్. సోమునాముడు ఎం.ఎ రాజు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించారు.

## సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలి: డీపీవో


సంపద కేంద్రంలో వర్మికంపోస్టు ఎరువు తయారీని పరిశీలిస్తున్న డీపీవో లవరాజు

చింతపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సంపద (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని డీపీవో బి. లవరాజు అన్నారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆ యన స్థానిక సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంపద కేంద్రంలో వర్మికంపోస్టు, కంపోస్టు ఎరువు ఉత్పత్తి చేయాలన్నారు. గృహాల నుంచి తడి, పొడి చెత్తను ఎప్పటికప్పుడు సేకరించాలని కోరారు. గ్రామాల్లోని రక్షిత మంచి నీటి ట్యాంక్‌లను శు భ్రపరించి క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాలు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయరాదన్నా రు. మార్చి నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో ఇళ్ల పన్ను వసూలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

# డైనింగ్ హాలు బాహుబాగు

**చోడవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహు సుందరమైన భవనం అందుబాటులోకి వచ్చింది. అన్ని సదుపాయాలతో డైనింగ్ హాలు సమకూరింది. ఒకేసారి 54 మంది కూర్చొని భోజనం చేసేలా వెలుసుబాటు కలిగింది. ప్రముఖ కథా రచయిత విజయేంద్రప్రసాద్ సహకారంతో ఈ అవకాశం లభించింది.**

**చోడవరం విద్యార్థులకు బాహుబలి కథా రచయిత సహకారం**

- ఎంపీ నిధులు రూ.25 లక్షలతో అన్ని సదుపాయాలతో భవన నిర్మాణం
- రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్ నిర్ణయంపై హర్షం
- హైస్కూల్ విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిన నూతన భవనం

చోడవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు భోజనాలు తినేందుకు అవసరమైన డైనింగ్ హాలు నిర్మాణానికి సహకారం అందించి గ్రామీణ విద్యార్థుల పట్ల తనకు ఉన్న అభిమానాన్ని బాహుబలి కథా రచయిత విజయేంద్రప్రసాద్ చాటుకున్నారు. రాజ్యసభ సభ్యుడు కూడా అయిన విజయేంద్రప్రసాద్ స్థానిక ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా తన నిధులు రూ.25 లక్షలు డైనింగ్ హాలు నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఈ నిధులతో భవన నిర్మాణం పూర్తయిన విద్యార్థులకు సేవలు అందించడానికి సిద్ధంగా ముస్తాబైంది.

తెలంగాణాలో ఉండే విజయేంద్ర ప్రసాద్ గ్రామీణ ప్రాంతంలోని చోడవరం ప్రభుత్వ హైస్కూల్‌కు నిధులు కేటాయింపు వెనుక స్థానికుడు సినీ రచయిత కూడా అయిన పిన్నమరాజు శ్రీనివాసరాజు( చోడవరం చైతన్య) కృషి ఉంది. సినీ రంగంలో చోడవరం చైతన్యగా పేరొందిన శ్రీనివాసరాజు ఆది నుంచీ విజయేంద్రప్రసాద్ శిష్యుడిగా ఉన్నారు. సొంత ప్రాంతానికి ఏదైనా చేయాలన్న తపనతో తమ ప్రాంత పరిస్థితిని ఎంపీ విజయేంద్రప్రసాద్‌కు వివరించారు. తాము చదువుకున్న స్కూల్‌కు ఏదైనా సాయం చేయాలని అభ్యర్థించారు. ఈ మేరకు విజయేంద్రప్రసాద్ హైస్కూల్ అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేశారు. శ్రీనివాసరాజు మిత్రులైన ఉపాధ్యాయ సంఘం నాయకులు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు వెంకటపతిరాజు, టీవీ రమణ మాస్టారుతో పాటు మరికొందరు హైస్కూల్ ఉపాధ్యాయులతో హైస్కూల్ సమస్యలపై చర్చించారు. చివరకు విద్యార్థులు భోజనాలు తినడానికి సరైన వసతి లేదని గుర్తించి ఎంపీ ఇచ్చిన నిధులతో డైనింగ్ హాలు నిర్మించాలని నిర్ణయించారు. గత ఏడాది ఎంపీ నిధులు మంజూరైన వెంటనే సమగ్రశిక్షా ఇంజినీరింగ్ అధికారులు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ భవన నిర్మాణం పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.

ఈ భోజనశాలలో చాపరాయితో ఒకేసారి 54 మంది విద్యార్థులు కూర్చుని తినేందుకు వీలుగా బల్లల తరహాలు పక్కాగా నిర్మాణం చేపట్టారు. హాలులో ఫ్యాన్లతో పాటు చేతులు, కంచాలు కడుక్కునేందుకు కొళాయిలు కూడా ఏర్పాటు చేశారు. ఈ హైస్కూల్‌లో చదివే వారంతా గ్రామాలనుంచి వచ్చే విద్యార్థులే. వారంతా పాఠశాలలో భోజనాలు చేయడానికి అవకాశం లేక స్కూల్ గ్రౌండ్ లేదా వరండాల్లో కూర్చొని భోజనాలు చేయవలసిన పరిస్థితి. ఎంపీ విజయేంద్ర ప్రసాద్ నిధులతో చేపట్టిన ఈ డైనింగ్ హాలు అందుబాటులోకి రావడంతో, ఇక వర్షాకాలంలో కూడా భోజనాలు చేయడానికి ఎలాంటి ఆటంకం కూడా ఉండదని ఉపాధ్యాయులు అంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఈ భవనాన్ని ప్రారంభించి డైనింగ్ హాలును విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని హెచ్‌ఎం పాండురంగారావు తెలిపారు. మొత్తమ్మీద ప్రముఖ దర్శకుడు రాజమౌళి తండ్రి, సినీ కథా రచయిత విజయేంద్రప్రసాద్ పేరుతో తమ స్కూల్‌లో డైనింగ్ హాలు ఏర్పాటు కావడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



డైనింగ్ హాలులో ఏర్పాటు చేసిన భోజనాల బల్లలు, ఫ్యాన్లు



చేతులు కడుక్కునేందుకు ఏర్పాటు చేసిన కొళాయిలు




ఎంపీ విజయేంద్ర ప్రసాద్ నిధులతో ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్మించిన డైనింగ్ హాలు భవనం

### విజయేంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు



మేం చదువుకున్న స్కూల్‌కు ఉపయోగపడే పని ఏదైనా చేయాలని అనుకున్నా. మా ప్రాంత పరిస్థితిని వివరించి, మా స్కూల్‌కు ఏదైనా సాయం అందించాలని కోరిన వెంటనే మా గురువు తన ఎంపీ గ్రాంటు నుంచి నిధులు మంజూరు చేయడం చాలా ఆనందంగా ఉంది. ఆయనకు మా చోడవరం ప్రాంత విద్యార్థుల తరపున కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా. -పిన్నమరాజు శ్రీనివాసరాజు, సినీ రచయిత. చోడవరం


## ఇంటర్ పరీక్షా కేంద్రాలకు ఓఎంఆర్ షీట్లు



జూనియర్ కళాశాలకు చేరుకున్న ఓఎంఆర్‌షీట్లు, బుక్‌లెట్లు

నర్సీపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్లు, హాజరుపట్టీలు పరీక్షా కేంద్రాలకు బుధవారం చేరాయి. ప్రత్యేక వాహనంలో వచ్చిన వీటిని నర్సీపట్నం జూనియర్ కళాశాల సిబ్బంది తీసుకొని గదిలో భద్రపరిచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ పద్మావతి మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. ప్రతీ గదిలో సీసీ కెమెరాలు అమర్చామని, అవసరమైన ఫ్యాన్లు, బెంచీలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శర్మ, చిన్నారావు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం




ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం జరుగుతున్న దృశ్యం

నర్సీపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా వీఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రాంతీయ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సూపరిటెండెంట్ డాక్టర్ సుధా శారద ప్రారంభించారు. పలువురు దాతలు ముందుకు వచ్చి రక్తం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్సు రత్నకుమారి, రక్త కేంద్రం ఇన్‌చార్జ్ సత్యానందం, రిషి కళాశాల ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

## వంద రోజుల పనులు పూర్తి చేయించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందర్రావు

చీడికాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులందరికీ వంద రోజులు పనులు పూర్తి చేయించాలని ఎంపీడీవో హేమసుందర్రావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరాసరి వేతనదారులు ఐదువేల మంది వచ్చేలా చూడాలని, కచ్చితంగా ఉదయం 6 నుంచి 11 గంటల వరకూ పనులు చేయించి రూ.300లు వచ్చేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా పండ్లతోటల పెంపకాన్ని లక్ష్యాన్ని పూర్తిచేయించాలన్నారు. సమావేశంలో వీసీ రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్ కె.ఎర్రునాయుడు పాల్గొన్నారు.

## ప్రతీ రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి: ఏవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వాసుదేవరావు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రంలో పేర్లు రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు సూచించారు. డి.గొటివాడ, ఎం.కోడూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేర్లు నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది లక్ష్మి, కమల, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

గొలుగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మపేట గ్రామంలో బుధవారం గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పుర వీధుల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అనంతరం తాండవ రిజర్వాయర్‌లో గౌరీపరమేశ్వరులను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గొల్లి రవి, సత్తిబాబు, వెంకటరమణ, భక్తులు, పాల్గొన్నారు.

# సంపద కేంద్రాల నిర్వహణ తప్పనిసరి

▸ జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి



తడిపొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న డీపీవో, డీపీఆర్‌సీ

గొలుగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను తప్పనిసరిగా నిర్వహించాల్సిందేనని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి స్పష్టం చేశారు. మండలంలోని జోగంపేట పంచాయతీ సంపద కేంద్రంలో బుధవారం 13 మండలాల కార్యదర్శులు, ఈవోపీఆర్‌డీలతో ఏర్పాటైన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తడిపొడి చెత్త సేకరించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. చెత్తను మూడు రకాలుగా వేరు చేయాలనే అంశం వివరిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిత్యం చెత్తను సేకరించేలా చర్యలు చేపట్టామన్నారు. సంపద కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నివేదిక అందించామన్నారు. ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలను భాగస్వాములను చేసేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి చెత్తసేకరణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోజీ, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, 13 మండలాల ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

రోలుగుంట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి భూ సమస్యలపై వచ్చే దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని తహసీల్దార్ నాగమ్మ సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మ్యుటేషన్, రీసర్వే గ్రామాల నుంచి వచ్చే దరఖాస్తులను సక్రమంగా విచారణ చేపట్టాలని చెప్పారు. అనంతరం గ్రామాల పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీ శంకర్ రావు, ఆర్‌ఐ రామమూర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.

## పిల్లలకు రాయడం, చదవడం నేర్పండి

చీడికాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు చదవడం, రాయడం నేర్పించాలని ఐసీడీఎస్ పీవో సిహెచ్.శ్రీదేవి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పునాది ఎంత దిట్టంగా కట్టుకుంటే ఇల్లు అంత బాగుంటుందని, విద్యార్థులకు కూడా ప్రీ ప్రైమరీ నుంచే పునాది వేయాలని సూచించారు ఈ శిక్షణలో ఎంఈవో-1, 2లు కె.బొంజుబాబు, బివి.రమణ, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## సమయం వృథా చేయొద్దు: ఎంఈవో

చీడికాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేవరకూ సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈవో కె.బొంజుబాబు ఆదేశించారు. మండలంలోని 11 ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం నుంచి ఈ ఏడాది 472 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని, శతశాతం ఉత్తీర్ణత సాధనకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాత్రి వేళల్లో చదువుతున్నది? లేనిది? పరిశీలన చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖాధికారులు హేమసుందర్, బీవీ.రమణ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు రేపు

చీడికాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో జి.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అభయాంజనేయ తీర్థం సందర్భంగా ఉదయం నుంచి పూజలు, మధ్యాహ్నం పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నగదుబహుమతులు అందిస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు మధ్యాహ్నం 3 గంటల్లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వారు చెప్పారు.

## ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం వీసీగా ప్రసన్నశ్రీ నియామకంపై హర్షం

కె.కోటపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం నూతన వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన ఆంధ్రా యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ సత్తుపాటి ప్రసన్నశ్రీకి ఇక్కడి అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం అభినందనలు తెలిపారు. బుధవారం ఆమెను విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాశీం మాట్లాడుతూ అంతరించిపోతున్న గిరిజన భాషలను కాపాడుకునేందుకు విశేష కృషి చేశారన్నారు. భగత, గదబ, కొలామి, కొండదొర వంటి 19 గిరిజన భాషలకు లిపి రూపొందించిన తొలి మహిళామూర్తిగా ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ నిలిచారన్నారు. విద్యావేత్తగా, సాహిత్యవేత్తగా, పరిశోధకురాలిగా సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీని వీసీగా నియమించడం హర్షణీయమని పేర్కొన్నారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

జిల్లా వనరుల కేంద్రం ఏడీ శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న వనరుల కేంద్రం ఏడీ శ్రీధర్

చోడవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీ శ్రీధర్ రైతులకు సూచించారు. మండలంలోని రాయపురాజుపేటలో ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ ఉద్యాన పంటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ పంటల సాగులో మెళకువలు, మేలైన రకాల వంగడాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్ మాట్లాడుతూ అపరాలలో మేలైన రకాలతో పాటు కొత్త వంగడాలను ఔత్సాహిక రైతులకు చిరుసంచుల రూపంలో రైతులు వచ్చే సీజన్ నాటికి అందిస్తామని తెలిపారు. అలాగే పంచాయతీలో ఆసక్తి కలిగిన 20 మంది రైతులతో క్లస్టర్ ఏర్పాటు చేసి, ఆ రైతులకు విత్తనం దశ నుంచి పంట కోత దశ వరకూ అవసరమైన ఇన్‌పుట్స్ ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్త సౌజన్య, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏలు సుబ్రహ్మణ్యం, రూప్సీలక్ష్మి, వ్యవసాయ శాఖ ఏడీ వి.రవీంద్రనాథ్, ఏవోలు తులసీమణి, పావని, విస్తరణాధికారులు కిరణ్, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీ భూముల్లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

మాకవరపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల చెందిన భూముల్లో ఆక్రమణలను బుధవారం తహసీల్దార్ లోకవరపు రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి తొలగించారు. మండలంలో భీమబోయినపాలెం గ్రామంలో గతంలో సుమారు 32 ఎకరాల ప్రభుత్వ డీ పట్టా భూములను మెడికల్ కాలేజీ నిర్మాణాలకు అప్పటి ప్రభుత్వం తీసుకుంది. అయితే కొంత స్థలంలో కాలేజీ నిర్మాణ పనులు చేపట్టారు. మిగులు ఉన్న ప్రభుత్వ భూమిలో భీమబోయినపాలెం పంచాయితీ శివారు గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు గుట్టుగా సరుగుడు మొక్కలు నాటారు. దీంతో గ్రామ సర్పంచ్ రుత్తల నందకిశోర్ తహసీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం సిబ్బందితో కలిసి తహసీల్దార్ కాలేజీ భూములను పరిశీలించారు. ఆక్రమణ చేసి నాటిన సరుగుడు మొక్కలను తొలగించి, ట్రాక్టరు సాయంతో పూర్తిగా చదను చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ భూములను ఆక్రమణ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పూర్తిగా భూమిని సర్వే చేయించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వేంకటేశ్వరరావు, డీటీ సోమశేఖర్, వీఆర్‌వోలు, టీడీపీ మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లు రామునాయుడు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలి

మండల సమావేశంలో ప్రజా ప్రతినిధులు విన్నపం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పైల రాజు

రావికమతం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు విన్నవించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఏ గ్రామంలోనూ ప్రజలు తాగునీటి సమస్యకు గురికాకుండా ముందుగానే అవసరమైన కార్యచరణ రూపొందించుకుని, ఆ విధంగా పనిచేయాలని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవంతరాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సభలో సభ్యులు స్పష్టం చేశారు. అలాగే గ్రామాలలో మంచినీటి పథకాలు, తాగునీటి బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీ టీసీ సభ్యులు, సర్పంచ్‌లు కోరారు. వేసవిలో అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా ఆ శాఖ అధికారులు చూడాలన్నారు. సాంకేతిక లోపం వస్తే తక్షణమే పునరుద్ధరణ చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తాగు నీరు, విద్యుత్ శాఖలపైనే చర్చ జరిపి సమావేశాన్ని వాయిదా వేశారు. ఎంపీడీవో వెంకన్నబాబు, తహసీల్దార్ వెంకటరమణ, వైస్ ఎంపీపీలు దంట్ల వెంకటరమణ, ఎం.భవానీప్రసాద్ పాల్గొన్నారు.

## ఇంటర్వ్యూ..

### పెదగోగాడ పీహెచ్‌సీలో 24 గంటలూ సేవలు

-కె.ఉషాచైతన్య, వైద్యాధికారి



**పెదగోగాడ పీహెచ్‌సీకి రోజూ 50 నుంచి 70 మంది రోగులు వస్తున్నారు. అయితే డెలివరీల కోసం ఆస్పత్రికి రావడానికి తగిన రవాణా సదుపాయం లేకపోవడంతో పాటు కుటుంబ సభ్యులకు ఇక్కడ ఎటువంటి ఆహారం దొరక్కపోవడంతో ఎక్కువ మంది రావడం లేదు. నెలలో 14 రోజుల పాటు 104 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. పీహెచ్‌సీ పరిధిలో ఒక డాక్టర్, దిబ్బపాలెం, బైలపూడి ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.**

ప్రశ్న: పెదగోగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)కి ప్రతి రోజూ ఓపీ ఎంత వస్తుంది?

**జవాబు:** 50 నుంచి 70 మంది రోగులు వస్తున్నారు.

ప్ర: సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

**జ:** ఒక డాక్టర్, దిబ్బపాలెం, బైలపూడి ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్ర: ఆస్పత్రి పని గంటలు ఎలా ఉన్నాయి?

**జ:** 24 గంటలు పని చేస్తున్నది.

ప్ర: ఆస్పత్రిలో నెలకు ఎన్ని డెలివరీలు అవ్వాలి? ఎన్ని అవుతున్నాయి?

**జ:** నెలకు కనీసం ఐదు అవ్వాలి. ఒక డెలివరీ వరకు అవుతున్నాయి.

ప్రశ్న: తక్కువ కావడానికి గల కారణాలు ఏమిటి?

**జ:** ఆస్పత్రికి రావడానికి తగిన రవాణా సదుపాయం లేకపోవడంతో పాటు కుటుంబ సభ్యులకు ఇక్కడ ఎటువంటి ఆహారం దొరక్కపోవడంతో ఎక్కువ మంది రావడం లేదు. అలాగే మొదటి కాన్పు అయితే సీహెచ్‌సీకి పంపిస్తాం. ఏ రిస్కు లేని వారికి ఇక్కడ డెలివరీ చేస్తాం.

ప్రశ్న: 104 వైద్య శిబిరాలు ఎన్ని జరుగుతున్నాయి?

**జ:** నెలలో 14 రోజుల పాటు 104 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: రవాణా సదుపాయం కోసం మీ సలహాలు ఏమిటి?

**జ:** ప్రస్తుత ప్రజాప్రతినిధులను రవాణా సదుపాయం కల్పించాలని కోరుతున్నాం.

-చీడికాడ, ఆంధ్రజ్యోతి

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పరీక్షా కేంద్రం మంజూరు

మాకవరపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇంటర్ పరీక్షా కేంద్రం మంజూరైనట్టు ప్రిన్సిపాల్ ఎం.భారత్‌శ్రీ తెలిపారు. ఇక్కడ పరీక్షా కేంద్రం లేక స్థానిక విద్యార్థులు నర్సీపట్నం, కృష్ణాదేవిపేట కేంద్రాలకు వెళ్లి పరీక్షలు రాయడానికి ఇబ్బందులు పడేవారన్నారు. ఈ ఏడాది ఆ సమస్యలు తప్పుతాయని చెప్పారు.

## హిందీ భాషోత్సవాలు

మాకవరపాలెం: బూరుగుపాలెం ఉన్నత పాఠశాలలో బుధవారం హిందీ భాషోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు మృణాళిని అర్థమయ్యేలా లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు నాటికలను ప్రదర్శించారు.

## 800 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

నర్సీపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదబొడ్డేపల్లిలో సారా తయారీ కేంద్రంపై పోలీసులు దాడులు చేశారు. బుధవారం సాయంత్రం సీఐ గోవిందరావు, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో కలిసి 800 లీటర్ల బెల్లం పులుసు ధ్వసం చేశారు.

## బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

చోడవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యోగా, ధ్యాన శిక్షణ తరగతులు

చోడవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పరీక్షలకు హాజరయ్యే కాలేజీ విద్యార్థులకు ధ్యాన, యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు యోగా ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యోగా గురువు పుల్లేటి సతీశ్ తెలిపారు. విద్యార్థుల్లో పరీక్షల భయం పోయేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9291376900 నంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

## రేపటి నుంచి సీతారామ ఆలయ ప్రారంభోత్సవాలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేచలంలో ఈ నెల 21వ తేదీ నుంచి సీతారామ ఆలయ ప్రారంభోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21న తిరువీధిలో ఆలయ శిఖర కలశాల ఊరేగింపు, 23న సీతారామ సహిత విఘ్నేశ్వరస్వామి, లక్ష్మీదేవీ విగ్రహాల ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహిస్తామని వారు చెప్పారు.

## మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలి

» కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జేపీసీ రాష్ట్ర చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జేపీసీ రాష్ట్ర చైర్మన్ ఏవీ నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ అమలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీవో నంబరు-2ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీవో వల్ల రాష్ట్రంలో మూడు లక్షల ఉద్యోగులను అభద్రత భావంలోకి నెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యమాల ద్వారానే ప్రభుత్వ నిర్ణయాలు వెనక్కి తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మార్చి 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు బి.కాంతారావు, ఫెడరేషన్ జేఏసీ జిల్లా నాయకులు వీవీ.శ్రీనివాసరావు, అచ్యుత కృష్ణ, బ్రహ్మాజీ, నూకేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 24న ఉపమాక వెంకన్న పెండ్లిరాట

నక్కపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏకైక ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ ఏడాది స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలకు సంబంధించి 24న పెండ్లిరాటోత్సవం (పందిరిరాట) వేయనున్నట్టు టీటీడీ ఈవో ఒక ప్రకటనలో చెప్పారు. మార్చి 9వ తేదీ నుంచి స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. పెండ్లి రాటోత్సవానికి అందరూ హాజరుకావాలని కోరారు.

## అనకాపల్లిలో ఏప్రిల్ 26 నుంచి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రతన్ టాటా స్మారక అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ ఏప్రిల్ 26 నుంచి నిర్వహిస్తామని టోర్నీ డైరక్టర్ మల్లిఖార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లిలో పది రోజులు జరిగే ఈ టోర్నీలో సుమారు 500 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరీ టోర్నీ కావడంతో అన్ని వయసులవారు పాల్గొనవచ్చునని, విజేతలకు రూ.12 లక్షల వరకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ టోర్నీకి సంబంధించి పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు.

## ఎ.కోడూరు స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

కె.కోటపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎ.కోడూరు పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. గంజాయి రవాణా నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, చెడు నడక కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి గస్తీ పటిష్టం చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో తరచూ సందర్శించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ పి.పైడపునాయుడు, ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి



రోడ్డు ప్రమాదంలో గాయాలతో ఉన్న రాజాన మోహన్..



దొడ్డి సన్యాసిరావు (ఫైల్)

లారీ ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటనలకు సంబంధించి పట్టణ, రూరల్ ఎస్ఐలు సావిత్రి, ఉపేంద్ర అందించిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన రాజాన మోహన్ (24) హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. పెదనాన్న కుమారుడి వివాహానికి హాజరు కావడానికి ఇటీవల గ్రామానికి వచ్చాడు. బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై పాత జాతీయ రహదారి మీదుగా ఎలమంచిలి బయలుదేరాడు. పోలిమేరమ్మ గుడి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా బైక్‌పై వస్తున్న ఎలమంచిలి కాకివాని వీధికి చెందిన వియ్యపు సత్యనారాయణను ఢీకొన్నాడు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మోహన్ పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎలమంచిలి పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన దొడ్డి సన్యాసిరావు (82) ద్విచక్ర వాహనంపై లైనుకొత్తూరులోని రైతు సేవా కేంద్రానికి వెళ్లాడు. అక్కడ పనిపూర్తయిన తరువాత ఇంటికి రావడానికి పాత జాతీయ రహదారిపైకి వచ్చే క్రమంలో ఎలమంచిలి నుంచి తుని వైపు వెళుతున్న లారీ ఢీకొన్నది. దీంతో సన్యాసిరావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు.

## హత్య చేసి కాల్చేశారు!

... 5వ పేజీ తరువాయి

అప్పన్నదేనని ఆయన కుమారుడు, బంధువులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నందున ఆ దిశగా దర్యాప్తు చేస్తామన్నారు. త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు. కాగా, అప్పన్న కుమారుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తన చిన్నాన్న కుమారుడి పెండ్లికార్డులు పంచడానికి ఈనెల 8న విజయనగరం వెళ్లారని, అదేరోజు ఎవరితోనే ఫోన్‌లో ఎక్కువసేపు, గట్టిగా మాట్లాడడం గమనించానన్నారు. ఆ ఫోన్ కాల్‌పైనే అనుమానం ఉందన్నారు. దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమిలి పోలీసు సిఐ సుధాకర్ తెలిపారు.



# దొండ తోటలకు బూడిద తెగులు

**వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సూచన**



దొండ ఆకులపై బూడిద తెగులు



బూడిద తెగులు ముదరడంతో పండిపోయిన ఆకులు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలోని కశింకోట, నర్సీపట్నం, పాయకరావుపేట, ఆనందపురం, సబ్బవరం మండలాల్లో దొండ తోటలను బూడిద తెగులు ఆశిస్తున్నదని, రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు మంచు దట్టంగా కురుస్తుండడం, ఆ తరువాత ఎండ తీవ్రత అధికంగా వుండడం వంటి అసాధారణ వాతావరణ మార్పుల కారణంగా బూడిద తెగులు వ్యాప్తి చెందుతున్నట్టు ఆయన చెప్పారు. తొలుత ఆకులపై లేత ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ కలిసి మొజాయిక్ వలే కనిపిస్తుందని, ఆ తరువాత ఆకుల పైభాగాన పసుపు రంగు మచ్చలు, ఆకుల అడుగున ఊదారంగు మచ్చలు కనిపిస్తాయన్నారు. దీంతో ఆకంతా తెల్లటి బూజు వంటి పదార్థం ఏర్పడి, ఆకులు పండుబారి ఎండిపోతాయని ఆయన వివరించారు. దొండ తోటల్లో బూడిద తెగులు నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్ మందును కలిపి ఆకులన్నీ తడిసేలా పిచికారీ చేయాలని సూచించారు. తెగులు సోకిన తోటలకు మందు పిచికారీ ఆలస్యమైతే దొండపాదులు ఎండిపోతాయని ఆయన చెప్పారు.

## వైభవంగా బాలచెంచమ్మ ఉత్సవం

» అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

» రాత్రి రెండు గంటల నుంచే కిలోమీటరుకుపైగా క్యూలైన్లు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం బాలచెంచమ్మ తీర్థ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మంగళవారం రాత్రి నుంచే అమ్మవారి దర్శనానికి కిలోమీటరుకుపైగా క్యూలైనులో భక్తులు బారులు తీరారు. ఉత్సవానికి కమిటీ సభ్యులు పది రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేశారు. బుధవారం వేకువ జాము నుంచే భక్తులు అమ్మవారికి చీరలు, రవికలు, అరటి పండ్ల గెలలు, గాజులు, పసుపు కుంకుమతో పాటు పలు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండుటెండను సైతం భక్తులు లెక్క చేయకుండా గంటలు తరబడి క్యూలైన్‌లో నిల్చొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు టెంట్‌లు వేసినప్పటికీ రద్దీ ఎక్కువ కావడంతో భక్తులకు మంచినీరు, అరటి పండ్లు, పులిహోర ప్రసాదం పంచారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ సెట్టింగ్‌లు, లైటింగ్‌లతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బీఎన్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతారాయం ఏర్పడడంతో రావికమతం పాత ఐసీడీఎస్ కార్యాలయం నుంచి గొల్లలపాలెం మీదుగా మేడివాడకు వాహనాలను మళ్లించారు. రావికమతం ఎస్ఐ ఎం.రఘువర్మ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.



కిలోమీటరుపైగా క్యూలో బారులు తీరిన భక్తులు



అమ్మవారికి సమర్పించేందుకు అరటి గెలతో వస్తున్న భక్తురాలు

## రహదారి భద్రతపై అవగాహన కల్పించండి

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ రహదారి భద్రతా సమన్వయ కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర లైటింగ్ ఏర్పాటు చేయాలని, స్పీడ్ బ్రేకర్ల వద్ద కలర్ పెయింటింగ్ వేయాలని ఆదేశించారు. ప్రమాదాల వల్ల చనిపోయిన వారికి పరిహారం త్వరతగతిన అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో హెల్మెట్ వినియోగం తప్పనిసరి చేయాలని, ధరించని వారికి అపరాధ రుసుము వసూలు చేయాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రిలో చేర్పి వైద్యం అందేలా చూసే వారికి అవార్డులను ప్రకటించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖాధికారి వి.మనోహర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పుల్లారి గోపికృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దొరస్వామికి మంత్రి లోకేశ్ సన్మానం



దొరస్వామిని సన్మానిస్తున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్

అనకాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం జరిగిన అంతర్జాతీయ దేవాలయాల సదస్సు (టెంపుల్ కనెక్ట్) ముగింపు సభ సందర్భంగా టీడీపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అచ్యుతాపురంలోని బ్రాండెక్స్ వస్త్ర పరిశ్రమ భారతీయ భాగస్వామి పి.దొరస్వామిని ఘనంగా సన్మానించారు. ఆలయాల నిర్వహణకు వినూత్న విధానాలు, ఉత్తమ పద్ధతులను అన్వేషించడం, స్థిరమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం, డిజిటలైజేషన్, ఆలయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను పెంపొందించడం వంటి అంశాలపై తిరుపతిలో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో (ఐటీసీఎక్స్) సదస్సు బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి లోకేశ్ అంతర్జాతీయ ఆలయాల సదస్సు-2025 తిరుపతిలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంతో చర్చించి విశిష్ట కృషి చేయడమే కాకుండా మూడు రోజుల సభను విజయవంతం చేయడంలో సమన్వయకర్తగా వ్యవహరించిన బ్రాండెక్స్ భారతీయ భాగస్వామి పి.దొరస్వామిని దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా దొరస్వామికి వేంకటేశ్వరస్వామివారి చిత్రపటాన్ని మంత్రి బహూకరించారు. అంతర్జాతీయ ఆలయాల సదస్సు తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు దొరస్వామి చేసిన కృషిని మంత్రి లోకేశ్ కొనియాడారు. ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా 17 దేశాల ఆలయాల ప్రతినిధులు హాజరయ్యారు.

## మైనింగ్ మాఫియాపై విజి'లెన్స్'

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. క్వారీలకు అనుబంధంగా క్రషర్లు నిర్వహించాలంటే తప్పనిసరిగా అనుమతి పొందాలి. అంతే కాకుండా క్రషర్ నుంచి బయటకు వెళ్లే ప్రతి లోడ్‌కు జీఎస్‌టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు డబ్బులు చెల్లించాలి. కానీ చాలామంది నల్లరాయి క్వారీల నిర్వాహకులు ఎటువంటి అనుమతులు పొందకుండానే స్టోన్ క్రషర్లను ఏర్పాటు చేసుకొని ఎడాపెడా ఆర్జిస్తున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు

అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నల్లరాయి క్వారీలు, స్టోన్ క్రషర్లు ఉన్నాయి. వీటి నుంచి విశాఖ నగరంలోని వివిధ ప్రాంతాలకు రోడ్డు మెటల్, భవన నిర్మాణాలకు ఉపయోగించే కంకర, చిప్స్ వంటివి రవాణా అవుతుంటాయి. ఇంకా రాంబిల్లి మండలంలో ఎన్ఓఏబీకి నల్లరాయి బండలు సరఫరా చేస్తున్నారు. కాగా నల్లరాయి క్వారీల్లో పేలుడు సామగ్రి వినియోగానికి అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ పలు క్వారీల నిర్వాహకులు మందుగుండు సామగ్రితో కొండలను పేల్చేస్తున్నారు.

### కూటమి హయాంలోనూ మాఫియాదే హవా!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మైనింగ్ మాఫియా ఆగడాలకు చెక్ పడుతుందని అంతా భావించారు. కానీ అటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు. కూటమిలో ఒక పార్టీకి చెందిన స్థానిక నాయకులు, మైనింగ్ మాఫియాతో జత కట్టారు. గ్రామాల అభివృద్ధి ముసుగులో మైనింగ్ మాఫియా నుంచి డబ్బులు తీసుకుని, అక్రమాలకు జెండా ఊపుతున్నారు. అక్రమార్కులు యథావిధిగా కొండలను పిండి చేసి జేబులు నింపుకుంటున్నారు. మైనింగ్ మాఫియా అక్రమాలపై కూటమిలో మరో పార్టీ నేతలు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగం రంగంలోకి దిగింది. అధికారులు క్షేత్రస్థాయిలో మరింత లోతుగా తనిఖీలు నిర్వహించి, దశాబ్దాల నుంచి ఇక్కడ తిష్టవేసి కొండలను పిండి చేస్తున్న అక్రమార్కుల గుట్టును బయటపెట్టాల్సిన అవసరం ఎంతైనా వుందని స్థానికులు అంటున్నారు.

## 24న పీఎం కిసాన్ నిధులు విడుదల

అనకాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చివరి విడతగా రెండు వేల రూపాయలు ఈ నెల 24వ తేదీ రైతుల ఖాతాకు జమ కానున్నాయి. అనకాపల్లి జిల్లాలో లక్షా 94 వేల మంది రైతుల ఖాతాలకు రూ.38.84 కోట్లు జమ కానున్నాయి.

రైతులకు ఆర్థిక సాయం చేయడానికి 2019లో ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం ద్వారా ఇప్పటి వరకూ 18 పర్యాయాలు రెండు వేల వంతున అందజేశారు. అలాగే 19వ పర్యాయం ఈ నెల 24వ తేదీన మరో రెండు వేల రూపాయలు జమ చేయనున్నారు.

క్రైం... crime news

## వేర్వేరు ప్రదేశాల్లో 220 కిలోల గంజాయి పట్టివేత

నలుగురి అరెస్టు, రెండు వాహనాలు సీజ్



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసు అధికారులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి అనకాపల్లి జిల్లా మీదుగా కాకినాడ జిల్లా తుని పట్టణానికి తరలిస్తున్న 122 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం వంగసార నుంచి మైదాన ప్రాంతానికి కారులో గంజాయి తరలిస్తున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం వచ్చింది. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్ఐ భీమరాజు, సిబ్బంది కలిసి నాతవరం మండలం ములగపూడి కూడలి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. తుని వైపు వెళుతున్న ఒక కారుని ఆపి తనిఖీ చేస్తుండగా.. అందులోని ముగ్గురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు చుట్టుముట్టి వారిని పట్టుకున్నారు. అనంతరం కారు డిక్కీలో తనఖీ చేయగా 122 కిలోల గంజాయి లభ్యమైంది. గంజాయి రవాణా చేస్తున్న నర్సీపట్నం మండలం నీలంపేటకు బోడికొండ నాని, చింతపల్లి మండలం బలపం పంచాయతీ రాళ్లగెడ్డ గ్రామానికి చెందిన వంతల గిరిబాబు, నర్సీపట్నం వెంకునాయుడుపేటకు చెందిన కారు యజమాని భార్గవసాయిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో వున్నారని డీఎస్పీ చెప్పారు. నిందితులను అరెస్టుచేసి, మూడు సెల్ ఫోన్లు, కారు సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు.

### కొక్కిరాపల్లి హైవేపై 98 కిలోల గంజాయి



స్వాధీనం చేసుకున్న గంజాయి, కారుతో ఎక్సైజ్ అధికారులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కొక్కిరాపల్లి సమీపంలో 98 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ తేజో వెంకట కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన అందించిన వివరాలిలా వున్నాయి. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుర్జింగ్ సింగ్ ఆదేశాల స్థానిక ఎక్సైజ్ పోలీసులు జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కొక్కిరాపల్లి జంక్షన్ వద్ద కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో అనుమానాస్పదంగా వెళుతున్న ఒక కారును ఆపడానికి ప్రయత్నించారు. అయితే డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వేగంగా ముందుకు పోనిచ్చి, యూ టర్న్ తీసుకొని పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో పోలీసులు వెంబడించి కారును పట్టుకున్నారు. డ్రైవర్ కారును వదిలి పారిపోయాడు. కారులో 98 కిలోల గంజాయిని స్వాధీనం చేసకుని ఒక వ్యక్తిని అరెసు చేశారు. కారు, రెండు సెల్‌ఫోన్లు, రూ.5,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. కారు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

### బైక్ ఢీకొని ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ ఎర్రాపాత్రుడు

నర్సీపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. నర్సీపట్నం మండలం మొండికండి గ్రామానికి చెందిన లాలం ఎర్రాపాత్రుడు శారదానగర్‌లో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి నర్సీపట్నం నుంచి బొడ్డేపల్లి వైపు వెళుతుండగా, పెదబొడ్డేపల్లి నుంచి నర్సీపట్నం వస్తున్న ద్విచక్ర వాహనండీ కొట్టింది. ఎర్రాపాత్రుడు తలకు బలమైన గాయం తగలడంతో విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు తలకు శస్త్ర చికిత్స చేశారు. బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తి పరారీలో ఉన్నట్టు సీఐ గోవిందరావు తెలిపారు.

### గ్యాస్ బండల దొంగ అరెస్టు

నర్సీపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలమవీధిలో గ్యాస్ బండలు దొంగలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సీఐ గోవిందరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. వెలమవీధిలో నివాసం ఉంటున్న అడిగర్ల లక్ష్మి ఇంట్లోకి ఈ నెల 16 తేదీన పట్టపగలు గుర్తు తెలియని తాళాలు పగలగొట్టి చొరబడ్డాడు. ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ బండలు పట్టుకుపోయాడు. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. దీంతో వెలమవీధికి చెందిన పాత నేరస్థుడు కర్రి ఆనంద్ చోరీ చేసినట్టు గుర్తించి అరెస్టు చేశామని సీఐ గోవిందరావు తెలిపారు.

## టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి

» ఉమ్మడి విశాఖ జిల్లా కోఆర్డినేటర్ ప్రభావతమ్మ



గురుకుల కళాశాలను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ ప్రభావతమ్మ

గొలుగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ ఉమ్మడి విశాఖ జిల్లా కోఆర్డినేటర్ ప్రభావతమ్మ అన్నారు. మండలంలోని గొలుగొండ అంబేడ్కర్ గురకుల కళాశాలను బుధవారం సందర్శించారు. డార్మెంటరీ, తరగతుల నిర్వహణ తీరు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గుకుకులాల్లో సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మెనూ పక్కాగా అమలయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటీశ్వరరావు, చైర్మన్ చలపతిరావు, సభ్యుడు శివ, తదితరులు పాల్గొన్నారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 75.00 |
| లైవ్ ధర | 95.00 |
| విత్ స్కిన్ | 160.00 |
| స్కిన్ లెస్ | 170.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 437 |
| విజయనగరం | 441 |
| శ్రీకాకుళం | 441 |